సాక్షి 24|7

వికారాబాద్

బుధవారం 30-8-2017



లక్నాపూర్ ప్రాజెక్టు



కోట్‌పల్లి ప్రాజెక్టు

- వర్షపాతం సాధారణం కన్నా తక్కువే..
- నిండని చెరువులు, పారని వాగులు
- జలాశయాలకు చేరని కొత్త నీరు..
- జిల్లా అంతటా వర్షాభావ పరిస్థితి
- వినాయక నిమజ్జనానికి చెరువుల్లో నీరు కరువు
- ఆందోళనలో అన్నదాతలు, ప్రజలు

నీళ్లు రాలే..!

ఊరించి.. ఉసూరుమనిపిస్తున్న వర్షాలు

వర్షాకాలం ప్రారంభమైన తొలినాళ్లలో ఊరించిన వర్షాలు.. తదనంతరం ముఖం చాటేశాయి. జిల్లా వ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలు పంటలకు జీవం పోశాయి. కానీ.. చెరువులు, ప్రధాన జలాశయాల్లోకి నీరు చేరలేదు. వీటి కింద సాగులో ఉన్న ఆయకట్టు బీడుగా మారింది. రెండు నెలలుగా వర్షాలు కురవక పోవడంతో వర్షాధార పంటలు తెగుళ్ల బారిన పడ్డాయి. అతి కీలకమైన ఆగస్టు నెలలో సైతం వానలు లేక పంట చేతికందే పరిస్థితి కనిపించడం లేదు. వచ్చే నెలన్నర కాలంలో వర్షాలు కురవకపోతే కరువు ఛాయలు అలుముకున్నట్టే!

– సాక్షి, వికారాబాద్

వివరాలు 8-9లో



- రైతు సమన్వయ సమితుల ఏర్పాటు విధివిధానాలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- తగాదాలు తథ్యమంటున్న విశ్లేషకులు
- రాజకీయాలు చేసేందుకే : రైతు సంఘాలు
- అధికారాలకు గండికొట్టడమే : రెవెన్యూ శాఖ

భిన్నవాదనలు

పారదర్శకత పేరుతో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న రైతు సమన్వయ సమితుల అంశం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ విషయమై రైతులు, రైతు సంఘాలు, ప్రతిపక్షాలు, రెవెన్యూ యంత్రాంగంలో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. నామినేటెడ్ ప్రాతిపదికన రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేయడమంటే భూ సంబంధ విషయాల్లో రాజకీయాలను చొప్పించటమేనన్న ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో సాంకేతిక పరమైన లోపాలు సరిదిద్దకుండా ఎన్ని సర్వేలు చేసినా వృథా ప్రయాసేనని రెవెన్యూ అధికారులు అభిప్రాయపడుతున్నారు. సమితుల పేరుతో తమ అధికారాలకు గండికొట్టాలని చూస్తే ప్రతిఘటన తప్పదని రెవెన్యూ యంత్రాంగం హెచ్చరిస్తుండడం గమనార్హం.

– సాక్షి, వికారాబాద్/పరిగి

2లో ▶

FOCUS

అధికార్ల బాగోతం!

ప్రభుత్వ శాఖల్లో అద్దె వాహనాల వినియోగంపై గతంలో చూసీచూడనట్టు వ్యవహరించిన ప్రభుత్వం ఇప్పుడు కన్నెర్ర చేస్తోంది.

వివరాలు 7లో

వైభవంగా గణనాథుల శోభాయాత్ర

ప్రశాంతంగా పండుగ జరుపుకోడం సంతోషదాయకం

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పి.మహేందర్‌రెడ్డి

ఆకట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ప్రదర్శన



భద్రేశ్వర్ చౌక్‌లో స్వాగతం పలుకుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

తాండూరు: తాండూరులో ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవడం సంతోషదాయకమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం తాండూరులోని వినాయకుల నిమజ్జన ఊరేగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పట్టణంలోని భద్రేశ్వర్ చౌక్‌లో హిందూ ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన వేదికపై నుంచి వినాయకులపై పూలు చల్లుతూ మంత్రి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో ప్రజలు ఐదు రోజులపాటు వినాయక చవితిని జరుపుకొని నిమజ్జన ఊరేగింపు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ అన్నపూర్ణ, కాంగ్రెస్ పార్టీ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్ మహరాజ్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, సిటీ కేబుల్ మేనేజింగ్ డైరెక్టర్ జీ నర్సింహారెడ్డి (బాబు), మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత, హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కరుణం పురుషోత్తంరావు, యంగ్ లీడర్స్ రాష్ట్ర అధ్యక్షులు పైలెట్ రోహిత్‌రెడ్డి, తాండూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రాజుగౌడ్, బషీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రోహిత్, నాయకులు సీసీఐ రాములు, హరిగౌడ్, అగ్గనూర్ జగదీశ్వర్, డా.సంపత్, బోయరాజు, బంట్వారం భద్రేశ్వర్, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సిద్రాల శ్రీనివాస్, ప్రభాకర్‌గౌడ్, తాండూరు కవులు సిద్ధిలింగయ్య, హిందూ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని యాదిరెడ్డిచౌక్ వద్ద గౌడ్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని భవానీ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఉత్సవాల్లో మహారాష్ట్రలోని పూణెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల బ్యాండ్ బాజా ఆకట్టుకుంది. సుమారు 80 మంది కళాకారులు పెద్ద ఎత్తున డప్పులతో మోత మోగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పారితోషికంగా వచ్చిన మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. కాగా.. శోభయాత్రలో సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోలాటాలాడారు. కాగా.. నిమజ్జనోత్సవాన్ని ఎస్పీ అన్నపూర్ణ పర్యవేక్షించారు.

రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిగా రత్నకల్యాణి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిగా ఆర్.రత్నకల్యాణి బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఈ స్థానంలో పనిచేసిన మహ్మద్ ఖాసీం బదిలీపై హైదరాబాద్ జిల్లాకు వెళ్లారు. దీంతో ఈ స్థానానికి.. నాగర్ కర్నూల్ జిల్లా వంగూర్ మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న రత్నకల్యాణికి పోస్టింగ్ ఇచ్చారు. 1995 బ్యాచ్‌కు చెందిన ఈమె గ్రూప్–2 కేడర్ అధికారిణి. ఆరు నెలల క్రితం ఆమెకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- సాక్షర భారత్ సిబ్బంది ధర్నా
- ఠాణాకు తరలించిన పోలీసులు

కొడంగల్: సర్కార్ తమకు ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సాక్షర భారత్ గ్రామ, మండల కోఆర్డినేటర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళనకు దిగారు. దీంతో ఎస్ఐ దాస్రూనాయక్ తన సిబ్బందిని అక్కడికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అనంతరం వారు నేరుగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట టెంటు వేసుకొని కూర్చున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు కోఆర్డినేటర్లు మాట్లాడుతూ.. మండల కోఆర్డినేటర్ల వేతనాలు రూ.30వేలు, గ్రామ కోఆర్డినేటర్ల జీతం రూ.10వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వయోజన విద్యా కేంద్రాల్లో సుమారు వెయ్యి రకాల పుస్తకాలు అందుబాటులో ఉండడంతో వాటిని గ్రంథాలయాలుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన సిబ్బందికి ప్రమాద బీమా వర్తింపచేయాలని కోరారు. వయోజన విద్యాశాఖను పంచాయతీ రాజ్ శాఖలో విలీనం చేయాలన్నారు. మండల కోఆర్డినేటర్లకు పోస్టు గ్రాడ్యువేషన్ చేశారని వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి క్రమబద్ధీకరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్ కృష్ణంరాజు, గ్రామ కోఆర్డినేటర్లు శేఖర్, పకీరప్ప, చిన్నయ్య, భీమప్ప, వెంకటయ్య, ఫరీదా, జయశాంత, రుక్మిణి, సావిత్రి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న కోఆర్డినేటర్లు

భిన్న వాదనలు

రైతు సమన్వయ సమితుల ఏర్పాటు విధివిధానాలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

సాక్షి, వికారాబాద్/పరిగి: ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి మొదలుకుని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నామినేటెడ్ తరహాలో ఏర్పాటు చేస్తామంటున్న రైతు సమన్వయ సమితుల విషయంలో ప్రభుత్వం ఇంకా పూర్తిస్థాయిలో స్పష్టత ఇవ్వడం లేదు. రైతు సమన్వయ సమితుల విషయంలో ఉత్తర్వులు విడుదల చేసిన సర్కారు జీఓ నంబర్‌ను సైతం కేటాయించ లేదు. ఇదే సమయంలో సమితులు చేయాల్సిన పనులు, నిర్వహించాల్సిన బాధ్యతలేంటనే విషయంలో ప్రభుత్వం ఇంకా విధివిధానాలను రూపొందించ లేదు. అయితే సమన్వయ ఈ సమితులలో గ్రామస్థాయిలో 15 మంది, మండల, జిల్లా స్థాయిల్లో 24 మంది, రాష్ట్ర స్థాయిలో 42 మంది సభ్యులు ఉంటారనే విషయం మాత్రం స్పష్టం చేసింది. కాగా.. గతంలో ఆయా స్థాయిల్లో ఎలాంటి కమిటీలు వేసినా.. కమిటీల కన్వీనర్లుగా సంబంధిత శాఖల అధికారులు ఉండే వారు. కాగా.. ప్రభుత్వం వేస్తున్న ఈ రైతు సమన్వ కమిటీలో మాత్రం అలాంటి విషయాలేవీ ప్రస్తావించలేదు.

ప్రభుత్వ ఉద్దేశమిదే..

గ్రామాల్లోని భూముల వివరాలు పక్కాగా ఉండేలా చర్యలు చేపట్టడంతో పాటు భూముల ప్యూరిఫికేషన్ (తప్పొప్పులను సరిచేయడం) చేయటం ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది. రికార్డుల ప్రకారం రెవెన్యూ, వ్యవసాయ తదితర శాఖల సర్వేలు పరిశీలిస్తే వేర్వేరు గణాంకాలు చూయిస్తున్నాయి. ఒక్కో శాఖ సర్వే ప్రకారం ఒక్కోరకంగా భూముల రికార్డులు, రైతుల ఖాతా నంబర్లు ఉన్నాయి. భూమి ఒకటే అయినప్పుడు ఏ శాఖ సర్వే చేసినా అంతే రావాలనేది ప్రభుత్వ వాదన. ఈ వాదనతోనే అధికార యంత్రాంగం చేసిన సర్వేలను ప్రభుత్వం శంకిస్తోంది. అలా కాకుండా భూముల వివరాలు, రైతుల వివరాలు పక్కాగా ఉండాలనే ఉద్దేశంతోనే రైతు సమన్వయ సమితుల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతూ వస్తోంది.

వృథాప్రయాసే..


సాంకేతిక పరమైన సమస్యలు పరిష్కారం చేయకుండా ఎన్ని సర్వేలు చేసినా వృథా ప్రయాసే అవుతుందని రెవెన్యూ యంత్రాంగం పేర్కొంటోంది. ఉదాహరణకు.. వెబ్‌ల్యాండ్, ఆన్‌లైన్ భూ రికార్డుల విషయంలో రైతు ఖాతాల నమోదుకు తహసీల్దార్లకు అధికారం ఉంది. అయితే అన్నదాత మృతి చెందితే వారి వారసుల పేరు మీద భూమార్పు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు అధికారం మాత్రం వీరికి లేదు. దీంతో ఖాతాలు పెరిగే అవకాశం ఉంటుంది. అప్పుడు వ్యవసాయ, రెవెన్యూ శాఖ ఇస్తున్న ఖాతాల సంఖ్య వేర్వేరు ఉండే అవకాశం లేకపోలేదు. ఇలాంటి సాంకేతిక సమస్యలు పరిష్కారం కాకుండా సర్వేలు చేసి లాభం ఉండదని రెవెన్యూ శాఖ వాదిస్తోంది. ప్రభుత్వం చెబుతున్న ప్రకారం సర్వే నంబర్ల ఆధారంగా మాత్రమే సర్వే చేస్తామంటోంది. అయితే బై నంబర్ల విషయంలోనే ఎక్కువ సమస్యలున్నాయి.

వివాదాలు పెరుగుతాయి..



సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా ఎన్ని సర్వేలు చేసినా వివాదాలు పెరుగుతాయి తప్ప.. తరగవు. అన్నదమ్ములు, దాయాదులు భూములు పంచుకునే సమయంలో భూములు బాగాలేని వైపు ఉన్న వారు రెండు మూడు గుంటలు ఎక్కువ, మంచి పొలం ఉన్నవైపు ఉండేవారు కాస్త తక్కువ తీసుకోవడం పరిపాటి. ఇప్పుడు సర్వే నంబర్‌లో ఉన్నవారికి సమానంగా కొలత చేసి ఇస్తామంటే సమస్యలు తలెత్తుతాయి. సబ్‌డివిజనల్ సర్వే చేయకుండా సమస్యలు ఎన్నటికీ పరిష్కారం కావు. – అబిద్‌అలీ, తహసీల్దార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ జిల్లా

రాజకీయాలకు తావిచ్చే అవకాశం ఉంది



భూ రికార్డుల ప్రక్షాళన, తప్పొప్పుల సవరణలు చేయడం మంచి ఉద్దేశమే. అయితే వీటికోసం సమితుల ఏర్పాటు నామినేటెడ్ పద్ధతి ద్వారా చేస్తామని ప్రభుత్వం నిర్ణయించడం మాత్రం రాజకీయాలకు తావిచ్చినట్లే. భూముల కొనుగోళ్లు, అమ్మకాలు సమితుల అంగీకారం మేరకు జరగాలన్న నిర్ణయం కూడా సరికాదు. దీంతో గ్రామాల్లో కక్షలు, విభేదాలు పెరిగే అవకాశం ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి. – బాబయ్య, మిట్టకోడూరు, రైతు సంఘం జిల్లా నాయకులు

టీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి

పూడూరు(పరిగి):

వెనుకబడిన తెలంగాణ ప్రాంతం అభివృద్ధే లక్ష్యంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పూడూరు సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ సర్కార్ పథకాలు మిగతా రాష్ట్రాలకు మోడల్‌గా నిలుస్తున్నాయని చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే జనవరి వరకు ప్రతి ఇంటికి తాగు నీరు అందించేలా సర్కార్ పనిచేస్తుందన్నారు. ఈక్రమంలోనే ప్రతి గ్రామానికి పైప్‌లైన్లు వేశారని గుర్తుచేశారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పూడికతీత పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తద్వారా భూగర్భజలాలు పెరిగి రైతులకు మేలు జరుగుతుందని వివరించారు. తెలంగాణ సర్కార్‌లో ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. ఆసరా పింఛన్‌లు, అహార భద్రత కార్డులు అర్హులైనవారందరికి అందజేశామని తెలిపారు. కుల సంఘాల అభివృద్ధే లక్ష్యంగా కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఈక్రమంలో గొల్లకురుమలకు గొర్రెల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని హరీశ్వర్‌రెడ్డి దీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చన్గోముల్ గ్రామానికి చెందిన పలువురు ఆయన సమక్షంలో టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశం, నాయకులు అజీం, శ్రీనివాస్‌గుప్తా, రాములు తదితరులు పాల్గొన్నారు.



హరీశ్వర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్టు

చేవెళ్ల:

గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చేవెళ్ల ఎక్సైజ్ సీఐ రాకేష్ తెలిపారు. చేవెళ్లలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వికారాబాద్ జిల్లా ధారూరు మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన కంది నర్సింలు, చేవెళ్ల గ్రామానికి చెందిన కొజ్జెంకి క్రిష్ణల వద్ద 100 గ్రాముల గంజాయి, 50 గ్రాముల గంజాయి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గత కొంతకాలంగా ఇలాంటి కార్యక్రమాలపై నిఘా పెట్టడంతో ఈ ఇద్దరు వ్యక్తులు చేవెళ్లలో గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. చేవెళ్ల మార్కెట్ యార్డు సమీపంలో అనుమానంగా సంచరిస్తుండగా సోమవారం రాత్రి అరెస్టు చేశారు. వీరిద్దరూ గంజాయి తాగడంతోపాటు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వీరి వద్ద ఉన్న 100 గ్రాముల గంజాయి, 50 గ్రాముల గంజాయి విత్తనాలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. ఈమేరకు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ వివరించారు.


నిందితులను చూపిస్తున్న ఎక్సైజ్ సీఐ రాకేశ్, సిబ్బంది

నిమజ్జనంలో గొడవ.. నలుగురిపై కేసు

దోమ(పరిగి):వినాయక నిమజ్జనంలో గొడవ జరగడంతో పోలీసులు నలుగురికిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని కొండాయిపల్లిలో మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాయిపల్లి హనుమాన్ దేవాలయంలో గ్రామస్తులు ఏటా వినాయకచవితి రోజు గణేషుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుంటారు. గతేడాది గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి రూ.25 వేలకు వేలం పాడి లడ్డూ దక్కించుకున్నారు. సంబంధించిన డబ్బులు ఇవ్వాలని స్థానికులు ఇటీవల ఆయనను అడుగగా నేడు రేపు అంటూ చెబుతూ వస్తున్నాడు. అయితే, రామకృష్ణారెడ్డితో పాటు గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్, పెంటయ్య తదితరులు ఈనెల 26న సాయంత్రం హనుమాన్ దేవాలయం తాళాలు పగులగొట్టి ఎవ్వరికీ సమాచారం ఇవ్వకుండా వినాయకుడి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఎక్కించుకుని నిమజ్జనానికి తరలించే యత్నం చేశారు. ఇది గమనించిన స్థానికులు వారిని అడ్డుకుని విగ్రహాన్ని దేవాలయంలో తిరిగి ప్రతిష్టించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. దీంతో గ్రామానికి చెందిన బాలకృష్ణతో పాటు పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు రామకృష్ణారెడ్డితో పాటు మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై చంద్రమౌళి మంగళవారం తెలియజేశారు.

వ్యభిచారం గుట్టు రట్టు

ఆమనగల్లు: పట్టణంలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న నిర్వాహకురాలు, విటుడుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రామలింగారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తూ పట్టుబడిన విటుడు, వ్యభిచార గృహం నిర్వాహకురాలిని కల్వకుర్తి కోర్టులో హాజరుపరచిన అనంతరం మహబూబ్‌నగర్, కల్వకుర్తి జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

ఆమనగల్లు పట్టణంలోని గుర్రంగుట్ట వద్ద మంగళవారం ఉదయం ఘర్షణ పడ్డ ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రామలింగారెడ్డి తెలిపారు. గుర్రంగుట్ట కాలనీలో ఇరువర్గాలు గొడవ పడ్డాయని అనంతరం శేఖర్ ఫిర్యాదు మేరకు ఆరు మందిపై, వెంకటేశ్ ఫిర్యాదు మేరకు 11 మందిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై రామలింగారెడ్డి వివరించారు.

అడవిపందుల దాడితో పంట ధ్వంసం

ఆరు ఎకరాల్లో మొక్కజొన్న నష్టం

బొంరాస్‌పేట(కొడంగల్):అడవిపందుల దాడితో ఆరెకరాల్లో రూ.2.5 లక్షలు విలువచేసే పంటనష్టం జరిగింది. ఈ సంఘటన మండల పరిధిలోని మెట్లకుంటలో జరిగింది. వివరాలు.. మెట్లకుంటలో రైతు పాలెపల్లి అనంతయ్య 2 ఎకరాలు, బొంపల్లి లక్ష్మయ్య రెండున్నర ఎకరాలు, పాలెపల్లి రాములు మరో ఎకరం పొలంలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. అయితే, సోమవారం రాత్రి అడవిపందులు వారి పంటలపై దాడి చేసి ధ్వంసం చేశాయి. దీంతో మొత్తం రూ.2.5 లక్షల విలువ చేసే నష్టం జరిగిందని రైతులు లబోదిబోమన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. తరచూ అడవి పందులు పంటలకు నష్టం చేస్తున్నాయని, ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


పాడైన మొక్కజొన్న పంట

సమష్టిగా డ్రగ్స్ నిర్మూలన

హైదరాబాద్: దేశంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుబడ్డాయని, రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న 24 మందిపై కేసులు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు. తోటి విద్యార్థులు డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిస్తే తల్లిదండ్రులతో పాటు యాజమాన్యం దృష్టికి తీసుకు రావాలన్నారు. నగరంలో 8 హ్యాబిటేషన్ సెంటర్లు ఉన్నాయని, దీనికి తోడు ప్రభుత్వ హెల్ప్‌లైన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మర్రి లక్ష్మణ్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, భాస్కరరెడ్డి, మానస, లక్ష్మీపతి, చుగ్, డాక్టర్ రాధికా దేవి, శ్రీనివాస్‌రావు, మధు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అకున్ సబర్వాల్

విద్యుత్ మోటార్ ఆన్‌చేయబోయి..

షాద్‌నగర్ క్రైం: ప్రమాదవశాత్తు ఇంట్లో విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం షాద్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన విమల(30) రోజు మాదిరిగానే ఇంట్లోని బోరు మోటార్‌ను ఆన్ చేయడానికి ప్రయత్నించగా విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయింది. ఇది గమనించిన స్థానికులు వచ్చి చూసే సరికి విమల మృతిచెంది ఉంది. మృతురాలి భర్త సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ ఏఎస్సై రాంచందర్ తెలిపారు.

దేవుడిని చూద్దామని వచ్చి.. దేవుడి దగ్గరికే..

వినాయక మండపం వద్ద విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతిచెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని విఠ్యాల గ్రామ పరిధిలోని శ్యామలబండ తాండాకు చెందిన జరుపుల సుధాకర్(35) సోమవారం రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్దకు వచ్చాడు. మండపం వద్ద ఏర్పాటు చేసిన సీరియల్ బల్బులు సుధాకర్‌కు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతుడి భార్య రాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.


విమలమ్మ మృతదేహం

ప్రమాదాలు.. మృతులు

రైల్లోంచి జారిపడి వ్యక్తి దుర్మరణం



కొత్తూరు(షాద్‌నగర్): ప్రమాదవశాత్తు రైల్లోంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవారం చోటు చేసుకొంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సర్దార్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు స్టేషన్ సమీపంలోని పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం పడి ఉందనే సమాచారం మేరకు అక్కడకు వెళ్లినట్లు తెలిపారు. మృతుడు గుర్తు తెలియని కదులుతున్న రైల్లోంచి లేదా పట్టాలు దాటే క్రమంలో ప్రమాదానికి గురై ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 35 ఉంటుందని, ఒంటిపై ఆకుపచ్చ రంగు టీ షర్ట్, చాక్లెట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

షాబాద్(చేవెళ్ల): విద్యుత్ షాక్ తగిలి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ మండలంలోని దామర్లపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... షాబాద్ మండలంలోని దామర్లపల్లి గ్రామానికి చెందిన కమ్మరి పొల్లుగచారి(40) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే ఈ నెల 20న సాయంత్రం దామర్లపల్లి గ్రామ పంచాయతీ బోరు పనిచేయక పోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ జంపర్ ఆపి కనెక్షన్ ఇవ్వడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఎగిరిపడ్డాడు. వెంటనే గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య కమ్మరి శశికళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


పొల్లుగచారి మృతదేహం

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

మహిళ దుర్మరణం

దుండిగల్: బైక్‌ను టిప్పర్ ఢీ కొనడంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన ముక్తర్, సాజిదాబేగం (40) దంపతులు మంగళవారం బైక్‌పై ఇస్నాపూర్ వెళుతుండగా, మల్లంపేట గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. సాజిదా బేగంపై నుంచి టిప్పర్ చక్రాలు వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ముక్తర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. మృతురాలి కుమారుడు సమీర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


సాజిదాబేగం మృతదేహం

బ్యాంక్ మేనేజర్‌పై కేసు

హైదరాబాద్: ఓ జాతీయ బ్యాంకు సీనియర్ మేనేజర్‌పై నల్లకుంట పీఎస్‌లో కేసు నమోదైంది. ఎస్సై సైదులు తెలిపిన వివరాలు .. శంకరమఠం పద్మాకాలనీకి చెందిన రేణుషా కండ్ తిలక్‌నగర్ బ్యాంక్ ఆఫ్ బరోడాలో ప్రొబెషనరీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 22న బ్యాంకుల సమ్మె రోజు ఆమె విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఆమె భోజనం చేస్తుండగా లంచ్ రూములోకి వచ్చిన బ్యాంక్ హెడ్(సీనియర్ మేనేజర్) భాటియా ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాధితురాలు రీజినల్ కార్యాలయంలో డీజీఎంకు ఫిర్యాదు చేయగా, ఉన్నతాధికారులు 24నఆమె స్టేట్‌మెంట్‌ను తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 28న బ్యాంక్ ఆఫ్ బరోడా యూనియన్ నేతలు రేణుషాకండ్‌కు ఫోన్ చేసి రాజీ కుదుర్చుకోవాలని కోరారు. దీంతో తనకు న్యాయం జరగదని భావించిన బాధితురాలు సోమవారం రాత్రి నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వాతావరణం

రానున్న 24 గంటల్లో గుజరాత్, కొంకణ్, ముంబైలల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. ఉత్తరాఖండ్, కేరళ, కర్ణాటక, ఒడిశా, తూర్పు రాజస్తాన్, ఈశాన్య రాష్ట్రాల్లో ఓ మోస్తరు వర్షపాతం నమోదవుతుంది. దక్షిణ తమిళనాడు, జమ్మూ కశ్మీర్ వాయవ్య ప్రాంతం మినహా దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురుమదురు వర్షాలు కురుస్తాయి.

వికారాబాద్ వాతావరణం

గరిష్టం కనిష్టం
29.0°/22.1°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	35.4	27.0
కోల్‌కతా	32.8	25.6
బెంగళూరు	26.6	20.6
ముంబై	28.2	24.1
చెన్నై	33.8	25.7

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
కర్నూలు	33.7/24.3	రాజమండ్రి	30.9/25.5
ఒంగోలు	33.7/24.3	తాడేపల్లిగూడెం	30.9/25.5
అనంతపురం	33.6/24.7	వరంగల్	30.7/24.5
చిత్తూరు	33.5/25.4	కరీంనగర్	30.6/24.8
తిరుపతి	33.5/25.4	శ్రీకాకుళం	30.5/25.0
నెల్లూరు	33.4/25.0	విజయనగరం	30.5/25.0
కడప	33.2/25.0	ఆదిలాబాద్	30.1/22.1
విజయవాడ	33.0/24.5	విశాఖపట్నం	29.7/24.4
గుంటూరు	32.2/24.6	హైదరాబాద్	29.0/22.1
నల్లగొండ	31.6/23.6	రంగారెడ్డి	29.0/22.1
ఖమ్మం	31.6/21.0	నిజామాబాద్	28.9/23.9
కాకినాడ	31.1/25.0	మెదక్	28.8/21.2
ఏలూరు	30.9/25.5	మహబూబ్‌నగర్	28.7/22.1

బుల్లితెర www.sakshi.com

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 స్క్రీన్‌ప్లే
మ.02.30 న్యూస్ ఫీచర్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్


టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.09.30 కథ
మ.12.00 నాయకుడు
మ.03.00 అమ్మాయి బాగుంది
సా.06.00 నీ స్నేహం
రా.09.00 ఆటాడిస్తా



మూవీస్ నౌ
ఉ.06.15 ఇన్‌టు ద స్టార్మ్
ఉ.08.00 మిస్టర్ నైస్ గై
ఉ.09.50 స్పిసిస్
మ.01.40 డై అనదర్ డే
రా.09.00 వాల్-ఈ




హెచ్‌బీవో
ఉ.07.43 ఎక్స్ ఎక్స్ ఎక్స్
ఉ.11.28 షావోలిన్ సాసర్
మ.03.10 సూసైడ్ స్క్వాడ్
సా.05.15 ద హ్యాంగోవర్-3
రా.09.00 మంకీ ట్రబుల్



సోనీ పిక్స్
ఉ.06.00 స్పైడర్ మ్యాన్
ఉ.08.24 మెన్ ఇన్ బ్లాక్ 3
ఉ.10.35 ద మమ్మీ రిటర్న్స్
సా.05.56 వార్‌క్రాఫ్ట్
రా.11.00 వోల్ఫ్ టొటెమ్



మా మూవీస్
ఉ.07.00 నా బంగారు తల్లి
ఉ.09.00 ఒకటో నంబర్ కుర్రోడు
మ.12.00 రాజేశ్వరి కల్యాణం
మ.03.00 రౌద్రం
సా.05.00 విల్లా



జీ యాక్షన్
ఉ.07.07 స్టైల్
ఉ.11.08 ఇన్సాఫ్
మ.02.04 శివమ్
రా.08.00 ప్లాట్‌ఫామ్
రా.11.05 ఇన్సానియత్



పాలలో వెన్నశాతం పెరగాలంటే..


పాడి గేదెలు, (ఇన్‌సెట్) హరిప్రసాద్

కుల్కచర్ల(పరిగి):

పాలలో వెన్నశాతం పెరగాలంటే తీసుకోవాల్సి జాగ్రత్తలు, సలహాలు, సూచనలను కుల్కచర్ల సహాయ పశువైద్యాధికారి హరిప్రసాద్ వివరించారు. పాలల్లో వెన్న శాతాన్ని బట్టి ధర చెల్లిస్తారు. వెన్నశాతం ఎక్కువగా వచ్చిన రైతులు అధిక లాభాన్ని పొందవచ్చు. లేకుంటే కష్టమంతా వృథా అవుతుంది. అందుకే కొందరు తాము పాడి పశువులను బాగా మేపుతున్నామని, దాణా కూడా పెడుతున్నామని.. అయినా వెన్న శాతం పెరగడం లేదని వాపోతుంటారు. ఇలాంటి వారు కొన్ని సూచనలు, మెలకువలు పాటించి వెన్నశాతాన్ని పెంచుకోవచ్చని ఆయన అంటున్నారు.

ఇలా చేస్తే..

- చాలా మంది పచ్చి గడ్డి వేస్తే బాగా పాలిస్తాయని బాగా వేస్తుంటారు. వెన్న శాతం పెరిగేందుకు పచ్చిగడ్డితో పాటు కొంత ఎండుగడ్డిని కూడా అందించాలి.
- పచ్చిగడ్డి, వరిగడ్డి ప్రతిరోజూ సుమారు ఎనిమిది నుంచి తొమ్మిది గంటల పాటు పశువు ముందు ఉండేలా చూడాలి. తద్వారా గడ్డి నమిలిన పశువు నెమరు వేస్తే లాలాజలం ఊరి వెన్న శాతం పెరుగుతుంది.
- పచ్చిగడ్డి పూర్తిగా లేతది కాకుండా పూర్తిగా ముదిరినది కాకుండా ఉండేలా చూడాలి.
- పచ్చిగడ్డి అందుబాటులో లేని సమయంలో పత్తి చెక్కను రాత్రి సయమంలో నానబెట్టి ఉదయం అందించాలి.
- నూనె తీసిన వేరుశనగ, నువ్వు, పొద్దుతిరుగుడు చెక్కను అందించాలి. దాణాను ఎక్కువ మొత్తంలో ఉదయం, సాయంత్రం అందించకుండా నాలుగు పర్యాయాలు కొద్ది కొద్దిగా అందించాలి.
- పాలు పిండే వ్యక్తి ఆరోగ్యవంతుడై ఉండడంతో పాటు ఎనిమిది నిమిషాల్లోనే పాలు పిండడం పూర్తి చేయాలి. ఒకే వ్యక్తి ఎప్పుడు పిండడం శ్రేయస్కరం.
- చివరి పాలలో వెన్నశాతం ఎక్కువగా ఉంటుంది. పాలు సంపూర్ణంగా పిండాలి.
- దాణాలో వంట సోడా రోజుకు 100 గ్రాములతో ప్రారంభించి 200 గ్రాముల వరకు ఇవ్వాలి.
- పాలుపిండే సమయంలో పశువులను కొట్టడం బెదిరించడం చేయొద్దు. ఇలా చేస్తే పాలు తగ్గే అవకాశం ఉంటుంది.
- పశువులను శుభ్రంగా కడగాలి. కొట్టం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి.
- పశువులు ఉండే గుడిసెలను ఎత్తైన ప్రదేశంలో ఉండే విధంగా నిర్మాణం చేయాలి, గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలి.

ఈ సమయాల్లో పాలలో వెన్నశాతం తగ్గుతుంది.

- సాధారణంగా పశువుల్లో వెన్నశాతం తగ్గడమనేది జాతి జన్యుపరమైన సామర్థ్యం, ఈతల సంఖ్య, ఆహారం, పాల దిగుబడి, వాతావరణం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.
- పాలు పిండే వ్యక్తి మారినపుడు పాలు పిండే సమయం ఎక్కువ తీసుకున్నపుడు, పాల దిగుబడితో పాటు వెన్న శాతం తగ్గే అవకాశముంటుంది.
- విదేశీ, సంకరజాతి పశువులు పాల దిగుబడి ఎక్కువ ఉన్నప్పటికీ వెన్న శాతం తక్కువగా ఉంటుంది.
- పాడి పశువు ఎదలో ఉన్న సమయంలో పాల ఉత్పత్తి వెన్నశాతం తగ్గుతుంది.
- పాడి పశువు ఈనిన రెండు నెలలోపు వెన్నశాతం తక్కువగా ఉంటుంది.
- పశువు ఎండలో ఉన్నా.. ఏదైనా వ్యాధికి గురైనప్పుడు, లేగదూడ మృతిచెందిన సమయంలో వెన్న శాతం తగ్గుతుంది.
- పచ్చిగడ్డి అధికంగా వేసిన సోయా చెక్క, వరి అన్నం, మొక్కజొన్న పెట్టిన సమయంలోనూ వెన్నశాతం తగ్గిపోయే ఆస్కారం ఉంది. కాబట్టి పాడి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

తిరుమల సమాచారం

తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ తగ్గింది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 8 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు – 3 ఖాళీ ఉన్నాయి
రూ.50 గదులు – 7 ఖాళీ ఉన్నాయి
రూ.100 గదులు – 25 ఖాళీ ఉన్నాయి
రూ.500 గదులు – 10 ఖాళీ ఉన్నాయి

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ – 250 ఖాళీ ఉన్నాయి
వసంతోత్సవం – 200ఖాళీ ఉన్నాయి
ఆర్జిత బ్రహ్మోత్సవం – 230 ఖాళీ ఉన్నాయి

బుధవారం ప్రత్యేక సేవ : సహస్రకలశాభిషేకం



అందరికీ విదేశీ విద్యావకాశాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

హైదరాబాద్: భారత్ లో అన్ని వర్గాల వారికి విదేశీ వైద్య విద్యావకాశాలు అందుబాటులో ఉన్నాయ ని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కజకిస్తాన్ ప్రభుత్వ సెమీ స్టేట్ యూనివర్సిటీ ప్రతినిధి లారిస్సా కోవలెవా సూచించారు. అమీర్‌పేట్ గ్రీన్‌పార్క్ మ్యారీగోల్డ్ హోటల్‌లో కజకిస్తాన్‌లోని వైద్య విద్యావకాశాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేవలం ఇంటర్‌తో అర్హత పరీక్ష ఉత్తీర్ణులై సెమీ స్టేట్ యూనివర్సిటీలో ప్రవేశం పొందే వీలుందన్నారు. యూనివర్సిటీ ప్రతినిధి షుమ్‌స్కీ నికోలేతో కలిసి వైద్య విద్యావకాశాల సమాచారంతో రూపొందించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సదస్సు సందర్భంగా సుమారు 40 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి యూనివర్సిటీలో ప్రవేశాలు కల్పించారు. యూనివర్సిటీ భారతీయ ప్రతినిధి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యం

మేషం: ముఖ్యమైన కార్యక్రమాలు ముందుకు సాగవు. ధనవ్యయం. ముఖ్య నిర్ణయాలలో మార్పులు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహవంతంగా ఉంటాయి.

వృషభం: పరిస్థితులు అనుకూలిస్తాయి. సంఘంలో గౌరవం. ఆధ్యాత్మిక చింతన. వ్యవహారాలలో విజయం. వ్యాపారాలు ఊపందుకుంటాయి. ఉద్యోగులకు ఉన్నతహోదాలు.



మిథునం: కొత్త వ్యక్తుల పరిచయం. శుభవార్తలు. ఆర్థికాభివృద్ధి. పాత సంఘటనలు గుర్తుకు తెచ్చుకుంటారు. విద్యావకాశాలు. వృత్తి, వ్యాపారాలలో కొత్త ఆశలు.

కర్కాటకం: ఎంత శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. భూవివాదాలు. ఆలోచనలు నిలకడగా ఉండవు. ఆధ్యాత్మిక చింతన. అనారోగ్య సూచనలు. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితి.

సింహం: పనుల్లో జాప్యం. ఆర్థిక ఇబ్బందులు. దూరప్రయాణాలు. ఆలయాలు సందర్శిస్తారు. బంధువర్గంతో అకారణ వైరం. వ్యాపార, ఉద్యోగాలలో చిక్కులు.

కన్య: అనుకున్న పనులు విజయవంతంగా సాగుతాయి. ఆర్థిక ప్రగతి. వస్తులాభాలు. చిన్ననాటి స్నేహితుల కలయిక. విందువినోదాలు. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.

తుల: కొత్త రుణాలు చేస్తారు. ఆలోచనలు నిలకడగా ఉండవు. బంధుమిత్రులతో విభేదాలు. ఆరోగ్యభంగం. వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగులకు అదనపు పనిభారం.

వృశ్చికం: కుటుంబంలో శుభకార్యాలు. రాబడి ఆశాజనకంగా ఉంటుంది. సన్నిహితులతో ఉత్సాహంగా గడుపుతారు. కొన్ని వివాదాల నుంచి బయటపడతారు. వృత్తి, వ్యాపారాలలో అనుకూలత.

ధనుస్సు: ఆదాయం అంతగా కనిపించదు. ఆస్తి వివాదాలు. ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్యం. వ్యాపార విస్తరణ యత్నాలు మందగిస్తాయి. ఉద్యోగులకు శ్రమాధిక్యం.

మకరం: నూతన కార్యక్రమాలకు శ్రీకారం. శుభవార్తలు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఆహ్వానాలు అందుతాయి. ముఖ్య నిర్ణయాలు. వృత్తి, వ్యాపారాలలో పురోగతి.

కుంభం: చిన్ననాటి సంఘటనలు గుర్తుకు వస్తాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. పాత బాకీలు వసూలవుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తినిస్తాయి.

మీనం: రుణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. ఆరోగ్య, కుటుంబసమస్యలు. వ్యయప్రయాసలు. మిత్రుల నుంచి ఒత్తిడులు. వృత్తి, వ్యాపారాలు సాదాసీదాగా ఉంటాయి.

– సింహంభట్ల సుబ్బారావు

రైతు బజారు వద్ద దుర్వాసన



వికారాబాద్ అర్బన్: పట్టణంలోని రైతు బజారు వద్ద వ్యాపారులు కుల్లిపోయిన కూరగాయలను ప్రధాన ద్వారం పక్కనే పారవేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వినియోగదారులు లోనికి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్ నిర్వాహకులు అక్కడే ఉంటున్నా పారిశుద్ధ్యంపై దృష్టి సారించడంలేదు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94920 28209

అంతా గుంతలమయం



మోమిన్‌పేట: చంద్రాయన్‌పల్లికి వెళ్లే రోడ్డు



బంట్వారం: సుల్తాన్‌పూర్‌లో పీఆర్ రోడ్డు దుస్థితి



బంట్వారం: కోట్‌పల్లిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇలా ..

మోమిన్‌పేట: మండల కేంద్రం నుంచి చంద్రాయన్‌పల్లి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు అంతా గుంతలమయంగా మారింది. దీంతో ఈ రోడ్లపై నడిచేదెట్లా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. చినుకు పడితే చాలు గుంతల్లో నీళ్లు నిలిచి వాహనాదారుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాని వారు పేర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి చినుకు పడితే చాలు ఇబ్బందులు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని కోరుతున్నారు.

సుల్తాన్‌పూర్ రోడ్డును పట్టించుకోరా?

బంట్వారం: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ఉన్న రోడ్డును ఎవరూ పట్టించుకోవడంలేదు. గ్రామంలో దాదాపు వంద మీటర్ల రోడ్డు నిర్మాణాన్ని పీఆర్ అధికారులు మరిచిపోయారు. దీంతో గుంతలు పడి నడవడానికి సైతం ఇబ్బందిగా ఉంది. కొత్తపల్లి మీదుగా సుల్తాన్‌పూర్ నుంచి బంట్వారం వెళ్లే ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది కిందట బీటీ రోడ్డు వేసిన గుత్తేదారు వంద మీటర్ల రోడ్డును వేయకుండానే వెళ్లిపోయారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయాన్ని ఎన్నిసార్లు తీసుకువెళ్లినా స్పందించడంలేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు వేయించాలని కోరుతున్నారు.

కోట్‌పల్లి మెయిన్ రోడ్డు ఇలా..

ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు నత్తనడకన సాగడంతో కోట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు బురదమయంగా తయారైంది. సంబంధిత గుత్తేదారు ఏడాది కాలంగా పనులు సాగిస్తున్నారు. చిన్నపాటి చినుకులు పడితే రోడ్డంతా చిత్తడిగా మారుతోంది. ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా రోడ్డంతా బురదతో నిండిపోయింది. ప్రజలు నడవడానికి కూడా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

ధాన్యం బస్తాలకు బీట్లు



మార్కెట్లో బీట్లు నిర్వహిస్తున్న కమీషన్ ఏజెంట్లు

వికారాబాద్: మర్పల్లి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యంకు మంగళవారం కమీషన్ ఏజెంట్లు బీట్లు నిర్వహించారు. ఈ బీట్లలో మొదటి రకం వామ క్వింటాల్‌కు రూ.8,100, రెండో రకం రూ.7,500 పలికింది. పసుపు మొదటిరకం క్వింటాల్‌కు రూ.7,000, రెండో రకం రూ.6,500 పలికింది. పెసర్లు క్వింటాల్‌కు రూ.4,700 పలికింది. ఈ బీట్లలో కొనుగోలుదారులు, కమీషన్ ఏజెంట్లు పాల్గొన్నారు. ప్రతీ మంగళవారం బీట్లను మార్కెట్ కార్యదర్శి, సూపర్ వైజర్ సమక్షంలో నిర్వహిస్తారు. ఈసారి వారిద్దరు విధులకు హాజరుకాకపోవడంతో మార్కెట్ సిబ్బంది ఆధ్వర్యంలో బీట్లు నిర్వహించారు.

మోమిన్‌పేటలో మోస్తరు వర్షం



మోమిన్‌పేటలో కురుస్తున్న వర్షం

మోమిన్‌పేట: మోమిన్‌పేటలో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా తుంపర వర్షం కురవడంతో పంటలకు మేలుచేసిందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం పట్ల రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నాసిరకం పనులతో ఇబ్బందులు



బురదలో దిగబడ్డ ఇసుక లారీ

వికారాబాద్: మర్పల్లి అనుబంధ గ్రామానికి వెళ్లే మెటల్ రోడ్డు పక్కల మిషన్ భగీరథ పైపులైన్ పనులు చేపట్టారు. ఈ క్రమంలో పైపులైన్ వేసిన తరువాత మట్టి పనులు నాసిరకంగా చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల ఆ మట్టి బురదగా మారింది. దీంతో ఓ లారీ అందులో ఇరుక్కుపోయింది. దీంతో రెండు గంటల పాటు తండా నుంచి మండల కేంద్రానికి వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ధర్నాతో దిగొచ్చిన యంత్రాంగం



బురదలో బస్సు దిగుతున్న ప్రయాణికులు



బురదను తొలగించి కంకర వేస్తున్న సిబ్బంది

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బురదమయం కావడంతో సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండల రాజకీయ జేఏసీ నాయకులు సోమవారం చేపట్టిన ధర్నాతో ఆర్‌టీసీ అధికారులు దిగొచ్చారు. బురదగా ఉన్న రోడ్డుపై కంకర వేఇస సరిచేశారు. బస్టాండులో విద్యుత్ బల్బులు వేయించేందుకు ఆదేశాలిచ్చారు. అప్పటికప్పుడు కొన్ని సమస్యలు పరిష్కారమైనట్లు ప్రయాణికులు తెలిపారు.

లోకల్ వాయిస్

లోఓల్టేజీని నివారించండి



ధారూరు: మండలంలోని నార్సపూర్‌లో నిత్యం లోఓల్టేజీ సమస్య నెలకొంటోంది. విద్యుత్ అవసరం లేని పగటిపూట సరఫరా బాగున్నా రాత్రిళ్లు ఇక్కట్లకు గురవుతున్నాం. ఈ విషయమై విద్యుత్ సిబ్బందికి పలుమార్లు చెప్పినా సరి చేయలేరు. అధికారులు కల్పించుకుని లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి.

- పాండు, నర్సాపూర్, ధారూరు మండలం

సమస్యలు పరిష్కరించాలి



వికారాబాద్: మర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండేళ్లుగా తాగునీటి సమస్యతో విద్యార్థులు అల్లాడుతున్నారు. ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కావడంలేదు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- మజర్, మండల అధ్యక్షుడు, టీఎన్ఎస్ఎఫ్

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

బిల్లు చూస్తే గుండె గుభేల్

రూ.22 లక్షల బకాయి ఉన్నట్లు వచ్చిన విద్యుత్ బిల్లులు



మోమిన్‌పేటలోని ఎన్కేపల్లి పంచాయతీకి అందిన విద్యుత్ బిల్లులు

మోమిన్‌పేట(వికారాబాద్): పంచాయతీలకు వచ్చిన విద్యుత్ బిల్లు చూస్తే గుండె గుభేల్ అనాల్సిందే. వందలు, వేలు కాదు ఏకంగా రూ.లక్షల్లో రావడంతో వామ్మో బిల్లు అని సర్పంచ్‌లు ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. పంచాయతీల్లో వీధి దీపాలు, తాగునీటి మోటార్ల విద్యుత్ బిల్లులు రూ.లక్షల్లో రావడంపై వారు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. వీధి దీపాలు, తాగునీటి బోరు మోటార్లకు మీటర్లు లేకున్నా విద్యుత్ బిల్లులు తడిసి మోపెడు వస్తున్నాయని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల నుంచి పన్నుల రూపేణా వచ్చే ఆదాయం అంతంత మాత్రమేనని వారు పేర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంట్లపై ఆధారపడుతున్న పంచాయతీలు రూ.లక్షలలో వచ్చే విద్యుత్ బిల్లులను చెల్లించలేమని చేతులెత్తేస్తున్నారు. పద్నాల్గవ ఆర్థిక సంఘం నిధుల నుంచి 10శాతం బిల్లులు చెల్లించేందుకు ఆయా గ్రామ పంచాయతీలు సమ్మతించి చెల్లిస్తున్నారు. అయినా రూ.లక్షల్లో బిల్లులు రావడం వారిని ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఎన్కేపల్లి గ్రామ పంచాయతీకి మూడు బిల్లుల్లో రూ.22లక్షలు బకాయి ఉన్నట్లు విద్యుత్ అధికారులు బిల్లులు పంపారు. ఇలా మండలంలోని 20 పంచాయతీల సమస్య అని సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

శుద్ధ జలంతోనే ఆరోగ్యం



లింగాపూర్‌లో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న బేయర్ దక్షిణాసియా ప్రతినిధి రిచర్డ్ ఎవాల్డ్ వాండర్ మార్వే

మేడ్చల్ రూరల్ :

శుద్ధ జలంతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అవసరమని బేయర్ సంస్థ దక్షిణాసియా ప్రతినిధి రిచర్డ్ ఎవాల్డ్ వాండర్ మార్వే అన్నారు. మండలంలోని డబిల్‌పూర్ గ్రామ పంచాయతీ అనుబంధ లింగాపూర్‌లో బేయర్, టీబీ అలర్ట్ ఇండియా సంస్థలు రూ.7 లక్షల నిధులతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గార్డెన్, ఆర్వో వాటర్ ప్లాంట్‌లను సర్పంచ్ రాజమల్లారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకుని మినరల్ వాటర్ తాగి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. బేయర్ ఆధ్వర్యంలో శ్రీరంగవరం గ్రామ పరిధిలోని ఏర్పాటు చేసిన ప్యాడ్ యూనిట్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బేయర్ దత్తత తీసుకున్న గ్రామాలలో అన్ని వసతులు కల్పించి వాటి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ రాజమల్లారెడ్డి మాట్లాడుతూ బేయర్ సంస్థ తమ గ్రామాలను దత్తత తీసుకుని అన్ని విధాల అభివృద్ధి చేయడం సంతోషంగా ఉందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలు గ్రామాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భాస్కర్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ దేవసహాయం, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డి, మండల టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భాగ్యారెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, గ్రామ టీఆర్ఎస్ అధ్యక్షులు అశోక్, బేయర్ సంస్థ ప్రతినిధులు సుశీల్‌కుమార్ కౌశిక్ , సీఎస్ఆర్ జోషి, రెనీతా, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కారం

- ఎకరం స్థలాన్ని అప్పగించిన తహసీల్దార్
- దగ్గరుండి పర్యవేక్షించిన ఆర్డీఓ విశ్వనాథం
- రూ.10 లక్షలతో ప్రహరీ



శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ విశ్వనాథం

ధారూరు(వికారాబాద్): రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న శ్మశాన వాటిక స్థలం సమస్యకు కలెక్టర్ దివ్య ఆదేశంతో వికారాబాద్ ఆర్డీఓ విశ్వనాథం ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు పరిష్కారం లభించింది. మండలంలోని కేరెల్లిలో సర్వేనంబర్ 17లోని ఎకరా స్థలాన్ని శ్మశాన వాటికకు రెవెన్యూ శాఖ మంగళవారం కేటాయించింది. ఈ స్థలంలో తమకు ఇళ్ల నిర్మాణం కోసం ప్లాట్లు కేటాయించారని కొంతమంది గ్రామస్తులు అడ్డుతగులుతూ వచ్చారు. వేరేచోట ఇళ్ల స్థలాలు ఇస్తామని అధికారులు పలుమార్లు నచ్చ జెప్పినా వారు మొండికేశారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఆర్డీఓ విశ్వనాథంను ఆమె పలుమార్లు ఆ గ్రామానికి పంపినా సమస్య పరిష్కారంకాలేదు. తహసీల్దార్ గాయత్రి, ఆర్ఐ యాదయ్య, సర్వేయర్ భాగ్యవతి, వీఆర్ఓ నర్సింహులు, ఈఓపీఆర్డీ మున్నయ్య, కార్యదర్శి రాణి, సర్పంచ్ శిరీషారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి తదితరులతో శ్మశాన వాటిక వద్దకు వెళ్లి అందరితో చర్చించి సమస్యను పరిష్కరించారు. వెంటనే స్థలాన్ని గ్రామ కార్యదర్శి, సర్పంచ్ శిరీషారెడ్డిలకు అప్పగించారు. వెంటనే జేసీబీని తెప్పించి హద్దులు నిర్ణయించారు. శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు ముందుగానే మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

కళలను ప్రభుత్వం ప్రోత్సహించాలి



సమస్యలు విన్నవిస్తున్న కళాకారులు

అనంతగిరి(వికారాబాద్): ప్రభుత్వం కళలను ప్రోత్సహించాలని ఒగ్గు కథ కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు నాగులపల్లి నరసింహ్మ అన్నారు. వికారాబాద్‌లోని మల్లికార్జున భవనంలో ఒగ్గు కథ జిల్లా కళాకారుల సంఘ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఒగ్గు కథ కళాకారులను గుర్తించి వెంటనే గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. అర్హులైన వారికి వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలన్నారు. జీవనోపాధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఒగ్గు కళాకారులకు నైపుణ్యం పెపొందించే కార్యక్రమాలు చేపట్టి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. కళలపై ఆధారపడ్డ తమ జీవితాల్లో ఆర్థిక అవస్థలు తప్పడంలేదన్నారు. కళలను ప్రభుత్వం బయటకు తీసుకొచ్చి సంస్కృతిని కాపాడాలని కోరారు. అనంతరం జిల్లా కమిటీని ఏర్పాటుచేశారు. వికారాబాద్ మండల అధ్యక్షుడిగా శ్రీశైలం, పూడూర్ అనంతయ్య, నవాబ్‌పేట కిష్టయ్యలను అధ్యక్షులుగా నియమించారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, సాయన్న, శ్రీరాములు, శ్రీనివాస్, రాములు, యాదయ్య, బీరయ్య, అంతయ్య, శ్రీకాంత్, శంకర్, కుమార్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మిత్రకు ఫిర్యాదు..

భూసమస్య పరిష్కారం



సర్వే నిర్వహిస్తున్న సర్వేయర్ మల్లేశ్ తదితరులు

బొంరాస్‌పేట(కొడంగల్): రైతు సమస్యలపై ఏర్పాటు చేసిన కిసాన్‌మిత్ర కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు స్పందించి భూసమస్యకు పరిష్కారం చూపించారు. వివరాలు.. మండల పరిధిలోని ఎన్కెపల్లికి చెందిన రైతు శివప్పకు చెందిన భూమి కొంత కబ్జాకు గురైంది. ఈవిషయమై ఆయన కిసాన్‌మిత్ర కాల్‌సెంటర్‌కు కాల్ చేసి ఇటీవల ఫిర్యాదు చేశాడు. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం మండల సర్వేయర్ మల్లేశ్, వీఆర్ఓ బుగ్గయ్య తదితరులు రైతు సర్వే నంబర్ 149ను సర్వే చేశారు. రెండెకరాల భూమి కబ్జాకు గురైందని నిర్ధారించారు. ఇరువర్గాలకు రైతులకు సర్దిచెప్పి సమస్యను పరిష్కరించారు.

నిర్మల్ పీఆర్‌ఈఈని అరెస్ట్ చేయాలి

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ జిల్లా సంఘం అధ్యక్షుడు అంజయ్య



పీఆర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అనంతగిరి(వికారాబాద్): నిర్మల్ జిల్లాలో పంచాయతీరాజ్ ఏఈఈ శ్రీకాంత్‌దేవి ఆత్మహత్యకు బాధ్యుడైన నిర్మల్ పీఆర్ (వీఅండ్‌క్యూసీ) ఈఈ రఘువీరారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ జిల్లా సంఘం అధ్యక్షుడు, పరిగి డీఈ అంజయ్య డిమాండ్ చేశారు. వికారాబాద్‌లోని పీఆర్ కార్యాలయంలో విధులు బహిష్కరించి కార్యాలయం ఎదుట ఉద్యోగులు మంగళవారం ధర్నా చేశారు. అనంతరం రెండు నిమిషాల పాటు ఉద్యోగులంతా మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న శ్రీకాంత్ మృదుస్వభావి అని, ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం దృష్టా డిపార్ట్‌మెంట్‌లో వచ్చారన్నారు. విధుల్లో చాకచక్యంగా వ్యవహరిస్తూ ఉండేవారన్నారు. ఈఈ వేధింపుల వల్లనే మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఈఈ కారణమని తెలిసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం బాధకరమన్నారు. ఉద్యోగులు మనోధైర్యంతో విధులు నిర్వహించాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు సహచర ఉద్యోగులతో, ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కరించేలా చూడాలన్నారు. విధుల్లో ఒత్తిడికి లోను కాకుండా పని చేయాలన్నారు. పీఆర్ డిపార్ట్‌మెంట్‌లో కింది స్థాయి ఉద్యోగిని వేధించి ఆయన ఆత్మహత్యకు పాల్పడేలా ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి డీఈ రాజకుమార్, తాండూర్ డీఈ గోపీనాథ్, కొడంగల్ డీఈ ఉమేష్, క్వాలిటీ సెల్ డీఈ లక్ష్మణ్‌రావు, ఏఈలు లక్ష్మయ్య, బాలచందర్, రాజు, శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లుక్కుమార్, సిబ్బంది, జిల్లాలోని పీఆర్ కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కిన్నెరసాని వచ్చిందమ్మా..

పారిశ్రామిక, వ్యవసాయ అవసరాలు తీరుస్తున్న ప్రాజెక్టు

భద్రాద్రి కొత్తగూడెం నుంచి తూమాటి భద్రారెడ్డి :

గోదావరి పరీవాహక ప్రాంతం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న కిన్నెరసాని, తాలిపేరు జలాశయాలు సాగునీటి అవసరాలనే కాకుండా పారిశ్రామిక అవసరాలనూ తీరుస్తున్నాయి. గోదావరి దిగువ భాగంలో పాల్వంచ మండలంలో కిన్నెరసాని ప్రాజెక్టు, ఎగువన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సరిహద్దు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టులు ఈ ప్రాంత అభివృద్ధిలో భాగం పంచుకుంటున్నాయి. అటవీప్రాంతానికి సమీపంలో ఉన్న ఇవి ఎప్పుడూ నిండుగా ఉంటాయి.

పారిశ్రామిక అవసరాల్లో కీలకపాత్ర..

1961లో నిర్మాణం ప్రారంభమైన కిన్నెరసాని 1972లో పూర్తయింది. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నిర్మితమైన ఈ ప్రాజెక్టు మొదట్లో కేటీపీఎస్, స్పాంజ్ ఐరన్ పరిశ్రమలకు నీటిని అందించేది. 2009లో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాల్వంచ, బూర్గంపాడు మండలాల్లోని 10వేల ఎకరాలకు సాగు నీరందించడం ప్రారంభించారు. అదేవిధంగా కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలకు తాగునీరు అందుతోంది. కిన్నెరసాని సామర్థ్యం 8.4 టీఎంసీలు. ఇందులో 6.95 టీఎంసీల (26.34 క్యూసెక్కులు) నీటిని వినియోగిస్తున్నారు. మిగిలిన 1.45 టీఎంసీలు డెడ్‌స్టోరేజ్‌గా 365 అడుగుల వరకు ఉంటుంది.

కిన్నెరసాని నుంచి నీటి కేటాయింపులు

కొత్తగూడెం మున్సిపాలిటీకి	0.473 టీఎంసీలు
(కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్) కేటీపీఎస్‌కు	2.712 టీఎంసీలు
పాల్వంచ మున్సిపాలిటీకి	0.200 టీఎంసీలు
నవభారత్ వెంచర్స్ లిమిటెడ్‌కు	0.126 టీఎంసీలు

ఇవే కాకుండా నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ)కు : 0.031 టీఎంసీలు, పాల్వంచ, బూర్గంపాడు మండలాల్లో 10వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు.

గిరిజనుల వరప్రదాయిని.. తాలిపేరు

గోదావరికి ఎగువ భాగంలో తాలిపేరు నదిపై నిర్మించిన తాలిపేరు ప్రాజెక్టు నిర్మాణం 1986లో పూర్తయింది. దీని నుంచి నీటిని చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని గిరిజన రైతుల పొలాలకు వదులుతారు. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 0.75 టీఎంసీలు. దీనికున్న రెండు కాలువల ద్వారా చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని 24,700 ఎకరాలకు సాగునీరు అందుతోంది. అనధికారికంగా మరో 10 వేల ఎకరాలు పారిస్తారు. 70 మీటర్ల లోతు ఉన్న ఈ డ్యామ్ నుంచి ఎప్పటికప్పుడు నీటిని బయటకు వదలాల్సిందే. అదనపు నీటిని 25 గేట్ల ద్వారా గోదావరిలోకి వదులుతారు.







చిట్టా దొరికింది.. రికవరే.. తరువాయి

నిజానికి ఈ ఏడాది ప్రారంభంలోనే అద్దెకార్ల వినియోగంలో అవకతవకలపై ప్రభుత్వం నివేదిక తెప్పించుకుంది. ర్యాండమ్‌గా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పరిశీలన చేయగా విస్తుపోయే అంశాలు వెలుగుచూశాయి. అక్రమాలకు పాల్పడిందెవరు?.. ఎంత మేరకు? రికవరీ ఎలా? అనే అంశాలపై దృష్టి పెట్టినట్టు సమాచారం.

అధికార్ల బాగోతం

ఉన్నతాధికారుల కనుసన్నల్లో అద్దె కార్ల వ్యవహారం

ఏళ్లుగా సాగుతున్న అక్రమ దందా

ప్రభుత్వ శాఖల్లో పెద్దఎత్తున అక్రమాలు

ట్యాక్సీ రిజిస్ట్రేషన్ ఉన్న వాహనాలు కాకుండా సొంత వాహనాల వినియోగం

ఆదిలాబాద్ నుంచి గొడిశెల కృష్ణకాంత్ గౌడ్ :

ప్రభుత్వ శాఖల్లో అద్దె వాహనాల వినియోగంపై ఎన్నో ఏళ్లుగా అనేక విమర్శలు వస్తూనే ఉన్నాయి. అయితే ఇన్నాళ్లూ చూసీచూడనట్టు వ్యవహరించిన ప్రభుత్వం ఇప్పుడు కన్నెర్ర చేస్తోంది. అసలు ఏ మేరకు అక్రమాలు జరుగుతున్నాయన్న విషయంపై ఆరాతీయగా కళ్లుచెదిరే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే ఏఏ జిల్లాల్లో ఎటువంటి అక్రమాలు చోటుచేసుకున్నాయన్న విషయం మొత్తం ఉన్నతాధికారుల చెంతకు చేరిపోయింది.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం..

ప్రధానంగా ప్రభుత్వ శాఖల్లో కొత్త వాహనాల కొనుగోలుపై నిషేధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రభుత్వ శాఖల్లో అత్యవసరమైతేనే వాహనాలను అద్దెకు తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ట్యాక్సీ రిజిస్ట్రేషన్ ఉన్న ప్రైవేట్ వాహనాలను మాత్రమే అద్దెకు తీసుకోవాలి. పెట్రోల్, డ్రైవర్ బత్తా, మెయింటెనెన్స్ చార్జీలు, ఇతర చెల్లింపులను ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లాల్లో మండల, డివిజన్, జిల్లాస్థాయి వరకు అధికారులు అద్దె వాహనాలను వినియోగిస్తున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఎస్పీలకు ప్రభుత్వం వాహనాలను సమకూర్చింది.

రూ. 24,000 అద్దె వాహనానికి ఇప్పటి వరకు నెలకు 2,500 కిలో మీటర్లకు రూ. 24,000 చెల్లించే వారు.

రూ. 33,000 జూలై ఒకటి నుంచి నెలకు జిల్లాల్లో రూ.33 వేలకు పెంచారు.

రూ. 34,000 జీహెచ్ఎంసీలో పెంచిన మొత్తం

“ బోగస్ బిల్లులపై ఆడిట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాహనాల లాగ్ బుక్స్ పరిశీలించాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులతోపాటు ఇందులో భాగస్వాములైన వారి నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇకపై బిల్లులు పాస్‌చేసే ముందు ట్రెజరీ అధికారులు పరిశీలన చేసుకోవాలని ఇప్పటికే మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం.





ఉదాహరణకు.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో సుమారు 45 అద్దె వాహనాలను ఉపయోగిస్తున్నారు. జిల్లా అంతటా కలిపితే 120 వాహనాలకు పైబడి ఉన్నాయి. వీటికి సుమారుగా ప్రభుత్వం నుంచి ప్రస్తుతం పెంచిన అద్దె ప్రకారం రూ. 40 లక్షలు ప్రతి నెలా చెల్లించాల్సి వస్తుంది.

రాజధానిలో ఇదీ పరిస్థితి..

అధిక వాహనాలను టెండర్లు లేకుండానే ఎంగేజ్ చేసుకుంటున్నారు. అధికారులు తమ బంధువులు, స్నేహితుల పేర్లపై ఉన్న వాహనాలకు బోగస్‌బిల్లులు పెడుతున్నారు. కొందరు సొంత వాహనాలకూ బిల్లులు పెడుతున్నారు. మరికొందరు అదనపు బాధ్యతలున్న పోస్టులోనూ ఒకే వాహనాన్ని వాడుతూ రెండుచోట్ల బిల్లులను క్లెయిమ్ చేసుకుంటున్నారు.

ర్యాండమ్ పరిశీలనలో అక్రమాలు బహిర్గతం

❖ **రంగారెడ్డిలో (వికారాబాద్, మేడ్చల్ కలుపుకొని):** ఈ జిల్లాల్లో కొంత మంది అధికారులు నిర్ణీత అద్దె చార్జీల కంటే అధిక మొత్తాన్ని వెచ్చించి వాహనాలను అద్దెకు తీసుకుంటున్నారు. కొంత మంది అధికారులు తమ సొంత వాహనాలను వాడుకుంటూ బోగస్ బిల్లులతో అద్దె దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.

❖ **నిజామాబాద్‌లో (కామారెడ్డి కలుపుకొని):** ఈ జిల్లాల్లో నిబంధనల ప్రకారం ప్రైవేటు ట్యాక్సీ వాహనాలు కాకుండా పలువురు అధికారులు తమ సొంత, కుటుంబ సభ్యుల పేర్లమీద ఉన్న వాహనాలపై బిల్లులను పొందుతున్నట్టు తేలింది. కొంత మంది అధికారులు ఏకంగా ఆటోలు, టూ వీలర్ల నంబర్లు పెట్టి బిల్లులను తీసుకుంటున్నట్టు బహిర్గతమైంది. ఏ నంబర్ల మీద అయితే బిల్లులు పొందుతున్నారో వారికి నెలనెలా రూ.1000 ఇచ్చి మిగతా బిల్లును వీరు కాజేస్తున్నారు. ట్రెజరీలో డీటీఓ, ఎస్టీఓలకు లంచమిచ్చి బిల్లుల పరిశీలన లేకుండా అద్దె పొందుతున్నట్లు స్పష్టమైంది.

❖ **ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ (ఉమ్మడి జిల్లాల ప్రకారం) :** ఈ జిల్లాల్లో వాహనాలు ఎక్కువ తిరగకపోయినప్పటికీ తిరిగినట్లుగా చూపిస్తూ బిల్లులు పొందుతున్నారు. కొంత మంది అధికారులు తమ సొంత వాహనాలను వాడుతూ అద్దె పొందుతున్నారు.

❖ **మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో :** కొంత మంది అధికారులు తమ సొంత వాహనాలను వాడి బిల్లులు పొందడమే కాకుండా, కాంట్రాక్టర్ల ద్వారా డీజిల్ పోయించుకుంటున్నారని తేలింది.

❖ **వరంగల్ ఉమ్మడి జిల్లాలో :** సొంత వాహనాలను ఎంగేజ్ చేసుకుని, బంధువులు, స్నేహితుల పేర్లపై అద్దె తీసుకుంటున్నారు.

వికారాబాద్‌లో చిరు జల్లులు ..



రోజంతా ముసురే..

- నిండని చెరువులు, పారని వాగులు
- వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు దాటినా లోటు వర్షపాతమే

వికారాబాద్ అర్బన్: వారం రోజులుగా ఏమాత్రం ఒరుపు ఇవ్వకుండా చినుకు చినుకు కురుస్తూనే ఉంది. తెల్లవారుజామున వర్షం పడుతుండటంతో జనాలు బయటకి వచ్చి పనులు చేసుకోలేకపోతున్నారు. పనుల్లోకి వెళ్లే సమయానికి కూడా వర్షం ఆటంకం కలిగిస్తుంది. వర్షకాలం ప్రారంభై రెండు నెలలు ముగిసినా వాగులు వంకలు పారలేదు. చెరువులు, కుంటల్లోకి నీరు అసలే చేరలేదు. ఆగస్టు రెండో వారం నుంచి ముసుర్లు కమ్ముకున్నా పెద్ద వానలు లేవు. దీంతో రైతులు కూడా ఆందోళనగా ఉన్నారు. ప్రస్తుత పంటలకు కొంత మేలైనప్పటికీ రానున్న రోజుల్లో నీటి కష్టం ఎలా ఉండబోతుందోనని దిగాలు పడుతున్నారు. జిల్లాలోని మర్పల్లి, బంట్వారం, కోస్గి, బొంరాసిపేట్, మోమిన్‌పేట్ తదితర మండలాల్లో తీవ్రంగా లోటు వర్షపాతం నమోదైంది. ఒక బషీరాబాద్ మినహా జిల్లాలోని 17మండలాల్లో ముసురు తప్ప వర్షం జాడ లేదు.

పత్తి, మొక్కజొన్నకు..

ఆగస్టు మొదటి వారంలోనే వర్షాలు మొఖం చాటేయడంతో రైతులు కొంత ఆందోళన చెందారు. పత్తి, మొక్కజొన్న వంటి పంటలు ఏపుగా పెరుగుతున్న సమయంలో అవసరమైన వర్షం అందకపోవడంతో పంటలు నష్టపోతామనుకున్నారు. అనుకోకుండా రెండో వారం నుంచి చిన్న చిన్న వర్షాలు కురుస్తుండటంతో ఈ రెండు పంటలకు జీవం పోసినట్లయింది. తాండూరు, పరిగి డివిజన్ల పరిధిలో ఎక్కువగా పండించే పెసర్లు, మినుము పంటలు దాదాపుగా ముసుర్ల వర్షానికి పాడైపోయాయి. కొన్ని మండలాల్లో మాత్రమే ఈ పంటలు రైతుల చేతికి అందాయి. వికారాబాద్ ప్రాంతంలో ఏమాత్రం పంట చేతికి రాలేదు. గతంలో ఆగస్టు చివరి నాటికి కొత్త పెసర్లు, మినుములు మార్కెట్‌కు వచ్చేవి. ఆగస్టు నెల ముగుస్తున్నా ఈ పంటలు మార్కెట్‌కు రాలేదు. జిల్లాలో సుమారు లక్షా 30వేల ఎకరాల్లో పత్తి, లక్షా 10వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా రైతులు ఈ పంటల మీదనే ఆశలు పెట్టుకున్నారు. ప్రధాన ప్రాజెక్టుల్లోకి నీరు చెరుకోకపోవడంతో ఇతర పంటలు వేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. కోట్‌పల్లి, లక్నాపూర్ వంటి ప్రాజెక్టుల కింద ఇప్పటికే వరి నాట్లు వేయాల్సి ఉన్నా ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో చాలా మంది రైతులు పనులు ప్రారంభించలేదు.

వర్షపాతం నమోదు ఇలా..

మే నెల చివరి వారంలోనే ఓ మోస్తరు వర్షాలు పడటంతో వాతావరణం చల్లబడింది. జూన్ నెలలో జిల్లా వ్యాప్తంగా 108.3 మి.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఏకంగా 178.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. జూన్ మాసంలో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసినా భూమి పదును అయ్యిందే తప్పితే వాగులు పారలేదు. జూలై నెలలో 203.8 మి.మీ సాధారణ వర్షం కురవాల్సి ఉండగా కేవలం 97.5 మి.మీ. వర్షం మాత్రమే కురిసింది. ఇక ఆగస్టు విషయానికి వస్తే 151.1 మి.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 91.6 మి.మీ. వర్షపాతమే నమోదైంది. మే నెల నుంచి క్రమంగా వర్షం తగ్గుతూ వస్తోంది. దీంతో చెరువులు, కుంటలు నేటికి నిండుకోలేక పోతున్నాయి.

కాలం కరుగుతోంది..

మిగిలింది నెలన్నరే..!

తాండూరు: వర్షాకాలం ఇంకా నెలన్నర మిగిలింది. ఇప్పటివరకు చెరువులలో నీరు చేరితే ఖరీఫ్ సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యేవారు. అయితే ఇంకా చెరువులలో నీరు లేక పోవడంతో చెరువుల కింద ఉన్న ఆయకట్టు భూములన్నీ బీడుగా మారాయి. వర్షాకాలంలో ఇంకా నెలన్నర సమయం ఉండటంతో రబీ సీజన్‌లోనైనా పంటలను పండించుకునే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.

పంటలకు చీడపీడలు..

జిల్లాలో వర్షాలు కురవక పోవడంతో కరువుఛాయలు అలుముకుంటున్నాయి. ఇప్పటికే రైతులు పండించిన పంటలకు చీడపీడల రూపంలో పంటలకు నష్టం వాటిల్లుతోంది. తాండూరు ప్రాంతంలో అధికంగా కంది, పత్తి పంటను సాగు చేశారు. వర్షాలు లేక పోవడంతో పత్తి పంటకు చీడపీడల బెడదతో రైతులు నష్టపోతున్నారు. వర్షాభావం కారణంగా పెసర పంటదిగుబడులు భారీగా పడిపోతున్నాయని వ్యవసాయాధికారులు అంటున్నారు. వర్షం కురవక పోతే కంది పంటపై ఆశలు వదిలేయాల్సిన పరిస్థితులున్నాయని రైతులు చెబుతున్నారు.



వర్షాభావంతో పత్తి పంటకు సోకిన తెగులు

నీళ్లు రాలే.. చింత తీరలే

సాగు నీటి ప్రాజెక్టులు వెలవెల

- కరుణించని వానదేవుడు
- ఎడారులను తలపిస్తున్న లక్నాపూర్, కోట్‌పల్లి, జుంటుపల్లి, సర్పన్‌పల్లి, శివసాగర్ ప్రాజెక్టులు
- రోజురోజుకు పడిపోతున్న ఆయకట్టు
- చెరువులు, కుంటల్లోనూ నీరు అరకొరే..
- అయోమయంలో అన్నదాతలు

జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులన్నీ నీరు లేక వెలవెలబోతున్నాయి. లక్నాపూర్, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి, శివసాగర్, జుంటుపల్లి ప్రాజెక్టులు, అలాగే చెరువులు, కుంటలు ఎడారులను తలపిస్తున్నాయి. పరిగి మండలంలోని లక్నాపూర్ ప్రాజెక్టు కింద ఆయకట్టు 2,647 ఎకరాలు. ఈ ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 0.5 టీఎంసీలు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి చేరిన నీరే ఉండగా, ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో కొత్త నీరు చేరలేదు. ఈ ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో లక్నాపూర్ ప్రాజెక్టులోకి నీళ్లు రాలేదు. దాదాపు అన్ని ప్రాజెక్టుల పరిస్థితి ఇలాగే ఉంది. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.

సాక్షి, వికారాబాద్/పరిగి:

పేరెన్నికగన్న సాగునీటి ప్రాజెక్టు కోట్‌పల్లి. ఈ ప్రాజెక్టును 1967లో ధారూరు మండలంలో నిర్మించారు. నీటి నిల్వ సామర్థ్యం ఒక టీఎంసీగా ఉంది. ఈ ప్రాజెక్టు కింద ధారూరు మండలంలోని మూడు గ్రామాలు, అలాగే పెద్దేముల్ మండలంలోని 15 గ్రామాల రైతులకు 9,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే లక్ష్యంతో కోట్‌పల్లి ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టుకు అభివృద్ధికి, మరమ్మతులకు ప్రభుత్వాలు ఒక్కపైసా కేటాయించలేదు. దీంతో కాలువలు, తూంలు పూడుకుపోవడంతో ఆయకట్టు కాస్త 5600 ఎకరాలకు పడిపోయింది. అది కూడా ప్రాజెక్టులో సుమారుగా 12 అడుగులకు పైగా నీటి నిల్వ ఉన్నప్పుడు మాత్రమే నీటిని పంటలకు విడుదల చేస్తారు. గత సంవత్సరం నీళ్లలేక ఖరీఫ్ పంటలకు నీరు ఇవ్వలేదు. వర్షాకాలంలో వానలు కురిసి ప్రాజెక్టులోని నీళ్ల రావడంతో గత రబీ సీజన్‌లో పంటలకు నీటిని అందజేశారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఇప్పటివరకు ప్రాజెక్టులోనికి నీళ్ల రాలేదు. ప్రస్తుతం నీటి నిలువ ఐదున్నర నుంచి ఆరడుగులు మాత్రమే ఉండడంతో విడుదల చేసినా కాలువల ద్వారా తూములవద్దకు కూడా చేరవనే ఉద్దేశంతో నీటిని విడుదల చేయడంలేదు.

సర్పన్‌పల్లి ప్రాజెక్టు

వికారాబాద్ మండలంలో సర్పన్‌పల్లి ప్రాజెక్టును 1981లో నిర్మించారు. ఈ ప్రాజెక్టు పరిధి కింద 4,600 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. వికారాబాద్ మండలంతో పాటు ధారూరు మండలంలోని పలు గ్రామాలకు సాగునీటిని అందించాలనే సదాశయంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. కాలువలు, తూంలు నాణ్యతగా లేకపోవడంతో ఎప్పుడు కూడా 3,200 ఎకరాలకు మించి నీళ్లు అందిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. నాసిరకం, నాణ్యతలేని పనులవల్ల ఆయకట్టు చివరి భూములకు నీరందడంలేదని రైతులు వాపోతున్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2014 సెప్టెంబరులో వీటి మరమ్మతులు, ఆధునికీకరణ, పునరుద్ధరణకోసంగాను 4కోట్ల 45 లక్షలు కేటాయించారు. అయినప్పటికీ అధికారుల అలసత్వం, కాంట్రాక్టరు నాసిరకం పనులు చేయడం మూలంగా ఇప్పటికీ చివరి భూములకు నీరందడం లేదు. కాగా ఈ సీజన్‌లో ఈ వర్షాలు అతితక్కువగా నమోదు కావడంతో ప్రాజెక్టులో నీళ్లు తక్కువగా ఉన్నాయి.

జుంటుపల్లి ప్రాజెక్టు

తాండూరు నియోజకవర్గంలోని యాలాల మండలంలో జుంటుపల్లి ప్రాజెక్టును 1866లో నిర్మించారు. ఈ ప్రాజెక్టు కింద 2,080 ఎకరాల ఆయకట్టు ఉంది. యాలాల మండలంతో పాటుగా బషీరాబాద్ మండలంలోని కాశీంపూర్ గ్రామానికి నీటిని అందించడమే ప్రాజెక్టు నిర్మాణ ప్రధాన ఉద్దేశం. కుడి, ఎడమ కాలువలు నిర్మించారు. కుడి కాలువ కింద 1060 ఎకరాల ఆయకట్టు కాగా, ఎడమ కాలువ కింద 1020 ఎకరాల సాగునీటి ఆయకట్టుగా నిర్ధారించారు. నీటి నిల్వ సామర్థ్యం 25 అడుగులు. 2011లో ఈ ప్రాజెక్టు పునరుద్ధరణకోసం కోటి 75 లక్షలు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించింది. కాగా నాసిరకం పనులు చేశారని పలుమార్లు రైతులు అప్పట్లో ఆందోళనలు కూడా చేపట్టారు. అదే విధంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మిషన్‌కాకతీయ–2లో కోటి 55లక్షలు కేటాయించారు. ఈ పనులు ఇంకా కొనసా..గుతూనే ఉన్నాయి. ప్రస్తుతం కూడా పనులు నాసిరకంగా ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



జుంటుపల్లి ప్రాజెక్టులో అడుగంటిన నీరు

శివసాగర్ ప్రాజెక్టు

తాండూరు నియోజకవర్గ పరిధిలో సాగునీటి వనరులను మరింత విస్తరించాలనే ఉద్దేశంతో వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2014లో 'శివసాగర్' ప్రాజెక్టుకు ఆగస్టు 14వతేదీన పనులను ప్రారంభించారు. ప్రాజెక్టు ఆయకట్టు వేయి ఎకరాలుగా నిర్ణయించారు. ఇందుకుగాను జలయజ్ఞం కార్యక్రమంలో మొదటి విడతగా 5 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించారు. ప్రాజెక్టు కట్ట నిర్మాణాన్ని మొదటి దశలో చేపట్టారు. కాగా కాలువలు, తూంలకోసం ప్రాజెక్టు పరిధిలోని రైతులవద్ద 40 ఎకరాల భూమి రైతులవద్ద సేకరించారు. వీటి నిర్మాణం కోసంగాను నీటి పారుదలశాఖ అధికారులు ఇటీవల 12 కోట్ల వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రాజెక్టు కింద 60శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

చెరువులు, కుంటలు 1,159

చిన్న నీటిపారుదల శాఖ గణాంకాల ప్రకారం వికారాబాద్ జిల్లాలో మొత్తం 1,159 చెరువులున్నాయి. వీటిలో ఈ సంవత్సరం వర్షాలకు కేవలం 25శాతం నిండిన చెరువులు 840 కాగా, 25 నుంచి 50 శాతం నిండిన చెరువులు 166, 50 నుంచి 75 నీళ్ల చేరినవి 98, 75 నుంచి 100 శాతం నిండిన చెరువులు కేవలం 45 ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల విస్తారంగా వర్షాలు కురిసినా జిల్లాలో మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలు కురవనేలేదు. దీంతో దాదాపుగా 80 శాతం చెరువులలో అంతంత మాత్రంగానే నీరు చేరింది.



ధారూరు: బేబికెనాల్ వద్ద చుక్క నీరు లేని దృశ్యం



ధారూరు: కొత్త నీరు రాక వెలవెలబోతున్న కోట్‌పల్లి ప్రాజెక్టు

తాండూరు: వెలవెలబోతున్న బెల్కటూర్ చెరువు



నారు ముదిరె.. రైతుకు గుబులె

తీవ్ర వర్షాభావం.. సాగుపై ప్రభావం

దౌల్తాబాద్(కొడంగల్): వర్షాకాలం మొదలై రెండు నెలలు గడుస్తున్నా చెరువుల్లో, కుంటల్లో కనీసం చుక్క నీరు చేరలేదు. తగిన వర్షాలు కురవకపోవడంతో మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి. గడిచిన రెండేళ్లలోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొనడంతో గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటాయి. బోరుబావుల్లో నీటిమట్టాలు అడుగంటడంతో రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఈ ఏడాదైనా పుష్కలంగా వర్షాలు కురిస్తే కరువు నుంచి గట్టెక్కగలమని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నా వరుణుడు కరుణించడంలేదు. నందారం అక్కల్‌రెడ్డిచెరువు, ఈర్లపల్లి అమ్మచెరువు, గోకఫసల్‌వాద్ జక్మల్‌చెరువుల్లోకి కొద్దిపాటి నీరైన చేరలేదు. దౌల్తాబాద్ పెద్దచెరువు, బాలంపేట పెద్దచెరువులోకి నీరురాకపోవడంతో పంటలసాగుకు విరామం ఏర్పడింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన కొద్దిపాటి వర్షాలకు బోరుబావుల కింద వరి సాగుచేసినా రైతులకు ఇప్పుడు కష్టాలు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చి మూడు నెలలవుతున్నా ముసురు తప్ప భారీ వర్షాలు రైతులను పలకరించలేదు. రోజుల తరబడి గ్రామాల్లో ముసురు వర్షాలు కురుస్తున్నా ఎలాంటి ఫలితం ఉండడం లేదు. ఈ ముసురుతో చిన్న చిన్న కుంటలు కూడా నిండడం లేదు. చాలా చోట్ల వరి నాట్లు ముదిరిపోతుండడంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. మండలంలో 60 శాతం మంది రైతులు వర్షాధార వ్యవసాయాన్ని నమ్ముకున్నారు. వర్షం పడితే ఆ నీటికే వరినార్లు వేసుకోవడం, చెరువులు, కుంటలు నిండితే వాటికింద పంటలు సాగు చేసుకోవడం ఇక్కడ పరిపాటి. మండలంలో 40 శాతం రైతులు బోరుబావులపై ఆధారపడగా మిగతా రైతులు చెరువులు, కుంటలపై ఆధారపడి వ్యవసాయం చేసేవారే. భారీ వర్షాలు వస్తేనే ఇక్కడి బోర్లలో నీరు వస్తుంది లేకుంటే అంతే సంగతి. మండలంలో ఈ ఖరీఫ్‌లో వర్షాదార పంటల సాగు విస్తీర్ణం పెరిగినా వరి సాగు మాత్రం సాధారణంలో 25శాతానికే పరిమితమైంది. అయితే చాలా మంది రైతులు మండలంలో సుమారుగా 2వేలకుపైగా హెక్టార్లలో మొక్కజొన్న, కంది పంటలు సాగు చేశారు.



నిండని నందారం అక్కల్‌రెడ్డి చెరువు



ముదిరిన నారుమడి

9 నోటిఫైడ్ చెరువులు, 90 వరకు కుంటలు

మండలంలో 9 నోటిఫైడ్ చెరువులు, 90 వరకు కుంటలు ఉన్నాయి. వర్షాకాలంలో ప్రధానంగా కుంటలు నిండితే ఒక్క పంటను పండిస్తారు. లేకపోతే వరిని పూర్తిగా మాని జొన్న, కంది, పత్తి తదితర పంటలను సాగు చేస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకు భారీ వర్షాలు లేకపోవడంతో రైతులంతా ఆరుతడి పంటలపైనే మొగ్గుచూపుతున్నారు. వరినాట్లు పోసుకున్న రైతులు కరిగెట్లు కటకటడానికి నీళ్ళు రాకపోవడంతో అయోమయ పరిస్థితులో కొట్టుమిట్టాడుతున్నారు. సామాన్యంగా వరినార్లు పోసిన నెలరోజులు లోపు నాట్లు వేస్తే మంచి దిగుబడినిస్తుంది. కాని ఇప్పటి వరకునార్లు పోసి రెండు నెలలకు కావస్తున్న భారీ వర్షాలు లేక పంట ఎండుముఖం పట్టింది. అయితే జూన్ నెలలో సాధారణంగా కురవాల్సిన వర్షాపాతం 105.1మి.మీ, ప్రస్తుతం కురిసిన వర్షాపాతం 179మి.మీ, జులైలో 183.5 మి.మీ వర్షాపాతం కురవాల్సి ఉండగా కేవలం80.6మి.మీ కురిసింది. మే నెలలో అంతంతమాత్రమంగానే కురిసింది.


అనంతగిరి: శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న విద్యార్థులు


ధారూరు: వినాయక విగ్రహాల ఊరేగింపు


ధారూరు: చిన్నారుల కోలాటం

శోభాయమానంగా నిమజ్జనం


మోమిన్‌పేట: చంద్రాయన్‌పల్లిలో ఊరేగింపు

జైబోలో గణేష్ మహారాజ్‌కీ జై.. గణపతి బప్పా మోరియా –ఆదా లడ్డూ ఖాలియా.. అంటూ నినాదాలు చేస్తూ వినాయకుని శోభాయాత్రను అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళాకారుల డప్పు వాయిద్యాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఐదురోజులు గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. తాండూరులోని భద్రేశ్వర్ చౌక్‌లో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిమజ్జన ఊరేగింపులో రవాణా శాఖ మంత్రి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.


కరన్‌కోట్: ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన పూణె బ్యాండ్


బషీరాబాద్: చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు


కుల్కచర్ల: ముజాహిద్‌పూర్ గంగపూజ చేస్తున్న భక్తులు


తాండూరు: కోలాటం ఆడుతున్న బాలికలు


తాండూరు: శోభాయాత్రలో బాలికల నృత్య ప్రదర్శన


తాండూరు: వేదిక వద్ద భక్తుల సందడి


దౌల్తాబాద్: నందారంలో భక్తుల పూజలు


కొడంగల్: గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న విద్యార్థులు


బొంరాస్‌పేట: బొట్లోనితండాలో ఊరేగింపులో యువకులు


పరిగి: నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

సీపీఎస్‌ను రద్దుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విఠల్

ధారూరు(వికారాబాద్): కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊరెళ్ల విఠల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కేరెళ్లి, ఎబ్బనూర్, అల్లీపూర్, కుక్కింద, కొండాపూర్‌కలాన్, ధర్మాపూర్, నాగసమందర్, మున్నూరుసోమారం పాఠశాలలో మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం అంతం, టీయూటీఎఫ్ పంతమని అన్నారు. సెప్టెంబర్ 1న సామూహిక సెలవుకు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు సంబంధించి హైకోర్టులో ఉన్న స్టేను రద్దు చేయడానికి ప్రభుత్వం సీనియర్ న్యాయవాదిని నియమించి ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల అడ్డంకులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటయ్య, మండల శాఖ అధ్యక్షుడు భాస్కర్, గౌరవ అధ్యక్షుడు విష్ణు, కోశాధికారి నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్ వ్యాక్సిన్‌తో వ్యాధులు దూరం



వ్యాక్సిన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బంట్వారం(వికారాబాద్): తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలకు విధిగా ఎమ్మార్ టీకాలు వేయించాలని జిల్లా మానిటరింగ్ అధికారి రమేష్ అన్నారు. మిజిల్స్, రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండల పరిధిలోని తొర్మామిడి ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న టీకాలను పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఎమ్మార్ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల తట్టు, వైరల్ ఇన్‌ఫెక్షన్స్ నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల పరిధిలో 9,954 మంది పిల్లలు 15 ఏళ్ల లోపు వారు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 25 వరకు ప్రోగ్రాం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ మునీందర్, సీహెచ్‌ఓ నర్సింగ్‌రావ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు



బహుమతులు అందజేస్తున్న నాయకులు

దౌల్తాబాద్(కొడంగల్): మండల పరిధిలోని కుదురుమళ్ల ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి ఖోఖో పోటీలను మంగళవారం మండలంలోని కుదరుమళ్ళ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఇందులో నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలకు చెందిన అండర్ 14, అండర్–17 బాలబాలికలు పాల్గొన్నారు. అండర్ – 17 బాలుర విభాగంలో కొడంగల్ ప్రథమ, దౌల్తాబాద్ ద్వితీయ, అండర్ – 17 బాలికల విభాగంలో కొడంగల్ ప్రథమ, దౌల్తాబాద్ ద్వితీయ, అండర్ – 14 బాలుర పోటీల్లో కొడంగల్ ప్రథమ, దౌల్తాబాద్ ద్వితీయ, బాలికల్లో ప్రథమ బహుమతి దౌల్తాబాద్, ద్వితీయ బహుమతి కొడంగల్ జట్లు గెలుపొందాయి. జెడ్పీటీసీ వెంకటమ్మ, ఎంపీపీ నర్సింగ్‌భాన్‌సింగ్, సర్పంచ్ మాణిక్యనాయక్, ఉప సర్పంచ్ లాలు, నాయకులు నర్సింహులు, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, యాదిరెడ్డి, రమేష్ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు.

సేంద్రియ సాగుపై దృష్టి సారిద్దాం

- ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు రాబడుదాం
- వ్యవసాయాన్ని లాభసాటిగా మారుద్దాం
- జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ పిలుపు
- 'సంకల్పంతో కార్యసిద్ధి'లో రైతులకు అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి గోపాల్



హాజరైన, ఏడీఏలు, ఏఓలు, ఏఈఓలు, రైతులు

అనంతగిరి(వికారాబాద్): సేంద్రియ ఎరువులతో పంటల సాగు చేపట్టి ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ రైతులకు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సంకల్పంతో కార్యసిద్ధి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం కర్షకులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 2020 నాటికి వ్యవసాయ అదాయాన్ని ద్విగుణీకృతం చేద్దామన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల విలువను పెంపొదించడం కోసం సురక్షితమైన నిల్వ పద్ధతులను అవలంబించాలని సూచించారు. సాగు చేసిన పంటలకు విధిగా బీమా చేయించాలన్నారు. అవసరం మేరకే ఎరువులు, రసాయనాలు వాడలన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చినప్పుడే రైతుల జీవితాలు బాగుపడుతాయని తెలిపారు. వికారాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగానే శీతల గిడ్డంగుల ఏర్పాటు, ధాన్యం నిల్వ చేసుకుని రుణం పొందే అవకాశం కల్పిస్తోందని చెప్పారు. ఈనామ్ విధానం ద్వారా రాష్ట్రంలోని ఏ మార్కెట్‌లో ఏ పంటకు ఎంత ధర ఉందో సులువుగా తెలుసుకునే సౌకర్యం కల్పించిందని వివరించారు. అధిక ధరలు ఉన్న ప్రాంతంలో రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం లభించిందని తెలిపారు. ఎంపీపీ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. రైతులు పడుతున్న కష్టానికి తగిన ప్రతిఫలం లభించేలా చేయడంలో ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు, వసతులు కల్పించాలని కోరారు. అనంతరం పలువురు సైంటిస్టులు వివిధ అంశాలపై రైతులుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు ముత్తాహార్ షరీఫ్, కృషి విజ్ఞాన్ కేంద్రం(క్రీడా) చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ విద్యాశేఖర్, శాస్త్రవేత్తలు శ్రీకృష్ణ, డాక్టర్ సుధీర్, వికారాబాద్ ఏడీఏ దివ్యజ్యోతి, కొడంగల్ ఏడీఏ విన్సెంట్ వినయ్‌కుమార్, పరిగి ఏడీఏ నగేష్‌కుమార్, జిల్లా కార్యాలయం ఏడీఏ రమాదేవి, వికారాబాద్ ఏఓ ప్రసన్నలక్ష్మితో పాటు ఆయా మండలాల ఏఓలు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, కార్మికుల శ్రేయస్సే సీఎం లక్ష్యం



వెల్‌చాల్‌లో అంగన్‌వాడీ సిబ్బందితో కృష్ణయ్య

మోమిన్‌పేట(వికారాబాద్): రాష్ట్రంలోని అంగన్‌వాడీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం కొండంత అండగా ఉందని టీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు భూమోళ్ల కృష్ణయ్య అన్నారు. మండల పరిధిలోని వెల్‌చాల్‌లో మంగళవారం అంగన్‌వాడీ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, కార్మికుల శ్రేయస్సుకు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అన్ని రకాల సహకారం అందిస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టంచేశారు. ఉద్యోగ విరమణ తర్వాత రూ.60 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం సమ్మతించిందని చెప్పారు. తమ పోరాటాలతోనే జీతాలు పెరిగాయని కొన్ని సంఘాలు అంగన్‌వాడీ కార్యకర్తల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. అవసరమైతే పోలీసు కేసులు పెట్టించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు అనంతయ్య, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి అరుణ, నాయకులు బాలేశ్వరీ, అమృతమ్మ, సుల్తానా బేగం, మంగమ్మ, తారాబాయి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

నింగిలో.. అందాల సింగిడి



వికారాబాద్ పట్టణంలోని ఉదయం నుంచి వర్షం పడుతూ తగ్గుతూ రాత్రి వరకూ కురిసింది. సాయంత్రం వేళలో ఆకాశంలో కనిపించిన ఇంద్రధనస్సు చూపరులను ఆకట్టుకుంది. సింగిడిని చూసిన చిన్నారులు ఆనందంతో గంతులు వేశారు.

– అనంతగిరి(వికారాబాద్):

ఎస్‌జీఎఫ్ నిర్ణయంపై విద్యార్థుల్లో నిరాశ

- పాత జిల్లాల ప్రాతిపదికనే క్రీడాకారుల ఎంపిక
- తాండూరులో ముగిసిన జోనల్‌స్థాయి పోటీలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

కరన్‌కోట్(తాండూరు): రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలని ఉవ్విళ్లూరిన పాఠశాల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్ణయం నిరాశ కలిగించింది. పాత జిల్లాల ప్రాతిపదికనే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేస్తామని ప్రకటించడంపై వీరు అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో జోనల్ స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా ఆ తర్వాత రాష్ట్రస్థాయికి ఎంపిక చేసేవారు. దీని వల్ల చాలామందికి అవకాశం లభించేది. నూతన జిల్లాల ఏర్పాటు అనంతరం మూడుగా విడిపోయన రంగారెడ్డి జిల్లాలో ఏర్పడిన వికారాబాద్ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయిలో మళ్లీ ఎంపిక ఎంపిక చేస్తారు. ఇందులో సత్తాచాటిన వారిని రాష్ట్ర స్థాయికి సెలెక్ట్ చేస్తారు. దీంతో పోటీ ఎక్కువగా ఉంటుంది. తాండూరులో వారం రోజులుగా జరుగుతున్న జోనల్ స్థాయి క్రీడలు సోమవారం మారుతి హైస్కూల్‌లో జరిగిన వాలీబాల్ పోటీలతో ముగిశాయి. తాండూరు డివిజన్ స్థాయిలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్‌జంప్, షాట్‌పుట్‌లో ప్రతిభ కనబర్చిన వారు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. వీరు వికారాబాద్ జిల్లా తరపున పోటీల్లో పాల్గొంటారు. జోనల్ కార్యదర్శి గంగయ్య ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక పూర్తైంది.

వెండితెర



నేనే రాజు నేనే మంత్రి:
ఏషియన్ శైలజ : వికారాబాద్)
11.15, 2.15, 6.15, 9.15
శాంత్‌మహల్
11.00, 2.00, 6.00, 9.00
జయ జానకి నాయక:
సినీమాక్స్ (వికారాబాద్)
11.00, 2.00, 6.00, 9.00
శ్రీలక్ష్మీమహల్ (తాండూరు)
11.30, 2.30, 6.30, 9.30



అదనంగా బస్సులు నడపాలి

వికారాబాద్: ప్రతీ మంగళవారం మర్పల్లి నుంచి మోమిన్‌పేట్, కల్‌ఖోడ, బుదేర, రావులపల్లి వరకు అదనంగా బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. మర్పల్లిలో సంత ఉండడంతో మోమిన్‌పేట్, బంట్వారం మండలతో పాటు సంగారెడ్డి సమీప గ్రామాలు వస్తారు. దీంతో ప్రయాణికులు, విద్యార్థులకు సరిపడా బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

Zone Guide

విద్యార్థులకు సరిపడా బస్సులు నడపాలి

వికారాబాద్ అర్బన్: విద్యార్థులకు సరిపడా బస్సులు నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు యాదగిరి అన్నారు. మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, జిల్లాకు చెందిన రవాణా శాఖ మంత్రి ప్రతీ మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిపిస్తామని చెబుతున్నారే తప్పా ఆచరణలో పెట్టడంలేదన్నారు. గ్రామాలకు బస్సులు వెళ్లకపోవడంతో వందల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బార్వాద్, మోత్కపల్లి, సాపన్‌పల్లి, మదన్‌పల్లి, అత్వెల్లి, కొంపల్లి తదితర గ్రామాలకు ఒకే బస్సు ఉండడంతో విద్యార్థులు ఆ బస్సులో వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు సరిపడా బస్సులు నడిపించాలని వారు డిమాండ్ చేశారు. మదన్‌పల్లి వరకు ప్రత్యేక బస్సు నడపాలన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రశాంత్ రెడ్డి, నరేష్, ముస్తాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిపోయే దీపం టీఆర్‌ఎస్: కాంగ్రెస్

యాలాల(తాండూరు): ఆరిపోయే దీపం లాంటిది టీఆర్‌ఎస్ పార్టీ అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్ అన్నారు. మండలంలోని గిరిజాపూర్ గ్రామంలో పలువురు టీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో దొరలపాలనతో పాటు కుటుంబ కంపెనీ పాలన కొనసాగుతోందని ఎద్దేవా చేశారు.

గణపతి బప్పా మోరియా



ధారూరు: ఊరేగింపులో మట్టి వినాయకుడు



అనంతగిరి: రైల్వే కాలనీలో శోభాయాత్ర



మోమిన్‌పేట: పూజలందుకుంటున్న గణనాథుడు

- ఘనంగా శోభాయాత్ర
- భక్తిపాటలు, భజనలు, నృత్యాలతో హోరెత్తిన ఊరేగింపు

ధారూరు: ఘండల కేంద్రంలో వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం శోభాయమానంగా సాగింది. వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులందరూ కలిసి నెలకొల్పిన వినాయకుడు ముందు వరుసలో ఉండగా, ఆ తర్వాత వివిధ కాలనీల్లోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వినాయకులు అనుసరించాయి. గణపతి బొప్పా మోరియా–ఆదా లడ్డూ ఖాలియా, గణేశ్ మహరాజ్‌కీ జై తదితర నినాదాలు చేస్తూ భక్తి పాటలు, భజనలు, నత్యాలు చేస్తూ ముందుకు కదిలారు. చిన్నారులు, యువకులు కోలాటం ఆడుతూ భజనలు చేస్తూ, కేరింతలు కొడుతూ, బ్యాండ్ మేళాల మధ్యన విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా వినాయకుల చేతుల్లోని లడ్డులను వేలం వేసి, ఆ తర్వాత కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

వికారాబాద్‌లో..

అనంతగిరి: వికారాబాద్‌లోని ఆయా వాడల్లో కొలువుదీరిన పలు గణనాథులను ఐదు రోజులు సందర్భంగా మంగళవారం నిమజ్జనం చేశారు. ఇందులో భాగంగా రైల్వే క్వార్టర్స్‌లో ప్రతిష్టించిన వినాయకుడికి నిత్యం పూజలు చేశారు. సరస్వతి జూనియర్ కళాశాల, వైష్ణవి హైస్కూల్, సిద్దార్థ హైస్కూల్, ధన్నారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలతో పాటు ఆయా వాడల్లో శోభాయాత్ర ఘనంగా సాగింది. యువకులు, విద్యార్థుల కోలాటాలు, నృత్యాలు చేస్తూ హుషారుగా ముందుకుసాగారు. ఎబ్బనూర్ చెరువులో నిమజ్జనం చేశారు.

పూజలందుకుంటున్న గణనాథుడు

మోమిన్‌పేట: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయక మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు ఐదవ రోజు భక్తులతో పూజలందుకొంటున్నాడు. భక్తులు ఉత్సహంగా భజనలు చేస్తున్నారు. మండలంలోని చంద్రాయన్‌పల్లిలో వినాయక నిమజ్జనాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి బప్పా మోరియో అంటూ యువకులు, భక్తులు నినదించారు. ఉదయం భక్తిశ్రద్ధలతో గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన వీధుల గుండా గణనాథున్ని ఊరేగిస్తూ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. అనంతరం నంది వాగు ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు.



ధారూరు: ఊరేగింపులో ఉత్సవ కమిటీ సభ్యులు



అనంతగిరి: శోభాయాత్ర



అనంతగిరి: వైష్ణవి స్కూల్‌లో చిన్నారుల కోలాటం

ఇంటర్వ్యూ



హరి
అంశం:డయల్ యువర్ డీఎం
మేనేజర్, వికారాబాద్ డిపో



ప్రశ్న: నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఏ ఉద్దేశంతో నిర్వహిస్తున్నారు?
జవాబు: ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవాలనే ఉద్దేశంతో, వారి సలహాలు సూచనలు కూడా ఇవ్వవచ్చు.
ప్రశ్న: కార్యక్రమం ఎప్పుడు ఉంటుంది, ఫోన్ నెంబర్లు తెలపండి?
జవాబు: నేడు సాయంత్రం 4గం నుంచి 5గంటల వరకు ఉంటుంది. ఫోన్ నెం: 9959226252, 7382826252కు చేయవచ్చు.
ప్రశ్న: డిపో పరిధిలో ఎన్ని గ్రామాలకు బస్సులు నడుపుతున్నారు?
జవాబు: రోడ్డు మార్గం ఉంది, బస్సులో పోవడానికి అవకాశం ఉన్నా అన్ని గ్రామాలకు బస్సులు నడుపుతున్నాం.
ప్రశ్న: డిపోలో ప్రస్తుతం ఎన్ని బస్సులు ఉన్నాయి. ?
జవాబు: 81 బస్సులు ఉన్నాయి. అన్నీ కూడా ఆర్డినరీ బస్సులే.
ప్రశ్న: చాలా గ్రామాలకు బస్సులు వెళ్లక విద్యార్థులు ధర్నా చేస్తున్నారు. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారు?
జవాబు: ప్రధాన రోడ్లకు అర కిలోమీటర్, ఒక కిటోమీటర్ దూరంలో ఉన్న గ్రామాలకు బస్సులు రావాలని కోరుతున్నారు. ఆ విషయాన్ని పరిశీలిస్తున్నాం. ఎక్కువ మంది విద్యార్థులు వచ్చే రూట్లలో రెండు నుంచి మూడు ట్రిప్పులు నడుపుతున్నాం.
ప్రశ్న: బస్టాండ్లలో సమస్యలు ఉన్నాయనే ఫిర్యాదు ఉన్నాయి..?
జవాబు: నిజమే. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్, ఖాళీగా ఉన్న షాపులను అద్దెకు ఇస్తున్నాం. సమస్యలపై ఇటీవలే నివేదిక తయారు చేశాం.
ప్రశ్న: వికారాబాద్ డిపో లాభాల్లో ఉందా?
జవాబు: ఈ ఆర్థిక సంవత్సరం చాలా బాగుంది. అన్ని ఆర్డినరీ బస్సులే అయినా ఇప్పటికే రూ.1.40 కోటి ఆదాయంతో కొనసాగుతోంది. రాష్ట్రంలోనే రెండు లేదా మూడో స్థానంలో ఉన్నాం.

– వికారాబాద్ అర్బన్:

తొలి రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాలు చేసిన కేసు?



కొప్పుల మల్లేశం
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ కళాశాల.



మాదిరి ప్రశ్నలు

1. స్వాతంత్ర్యానంతరం తొలి భాషాప్రయుక్త రాష్ట్రం ఏ సంవత్సరంలో ఏర్పడింది?
1) 1948 2) 1953
3) 1955 4) 1956

2. భారత్, బ్రిటిష్ రాజ్యాంగాల్లో ఉండే సాధారణ అంశాలు ఏవి?
ఎ) సమన్యాయ పాలన
బి) ఏక పౌరసత్వం
సి) డాక్ట్రిన్ ఆఫ్ ప్లెజర్
డి) తాత్కాలిక సభాధ్యక్షుడు
1) ఎ, బి 2) ఎ, బి, సి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

3. జమ్ము-కశ్మీర్ రాష్ట్రానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
1) అసెంబ్లీ పదవీ కాలం ఆరేళ్లు
2) గవర్నర్ కనీస వయసు 30 ఏళ్లు
3) విధాన పరిషత్ సభ్యుల సంఖ్య - 36
4) తొలిసారి రాష్ట్రపతి పాలన - 1984

4. భారతదేశంలో ప్రధానమంత్రి అధికారం కింద పేర్కొన్న ఏ సందర్భంలో బలహీనమవుతుంది?
1) సంకీర్ణ ప్రభుత్వం వల్ల
2) పార్లమెంటరీ ప్రభుత్వం వల్ల
3) ఏక పార్టీ ఆధిపత్యం వల్ల
4) అత్యవసర అధికారాల వల్ల

5. భారత రాజ్యాంగం ప్రకారం, బలహీన వర్గాలకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అనేవి..?
1) ఆదేశిక సూత్రాలు
2) సంక్షేమ సూత్రాలు
3) ప్రాథమిక హక్కులు
4) పౌరహక్కులు

6. భారతదేశంలో 'నిర్ణయీకరణ'కు అత్యున్నత వేదిక ఏది?
1) సుప్రీంకోర్టు
2) పార్లమెంట్ 3) రాజకీయ పార్టీలు
4) గ్రామసభ

7. భారత పార్లమెంట్‌ను రాష్ట్రపతి 'ప్రోరోగ్' చేస్తారు. దీని అర్థం?
1) లోక్‌సభను రద్దు చేయడం
2) పార్లమెంట్‌ను సమావేశ పరచడం
3) పార్లమెంట్ సమావేశాలను ముగించడం
4) పార్లమెంట్‌ను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించడం

8. రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ ప్రకారం, రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించే అధికారం సుప్రీంకోర్టుకు ఉంది?
1) 142 2) 144
3) 146 4) 147

9. భారత రాజ్యాంగంలో 'పీఠిక' అనేది?
1) షెడ్యూళ్లలో అంతర్భాగం
2) భాగాల్లో అంతర్భాగం
3) ఆర్టికల్స్‌లో అంతర్భాగం
4) రాజ్యాంగంలో ప్రత్యేకంగా ఉండే అంతర్భాగం

10. దేశంలో అతిపెద్ద హైకోర్టు 'అలహాబాద్ హైకోర్టు' ఏ సంవత్సరంలో ఏర్పడింది?
1) 1866 2) 1871
3) 1884 4) 1862

11. రాష్ట్ర స్థాయిలో విధాన సభ ఆమోదించిన సాధారణ బిల్లును విధాన పరిషత్ గరిష్టంగా ఎంతకాలం జాప్యం చేయగలుగుతుంది?
1) ఒక నెల 2) మూడు నెలలు
3) నాలుగు నెలలు 4) ఆరు నెలలు

12. మండల సంఘాలు (జోనల్ కౌన్సిల్స్) అనేవి?
1) రాజ్యాంగబద్ధమైనవి
2) సలహా సంఘాలు
3) కార్య నిర్వాహక సంస్థలు
4) శాసనసభ సంస్థలు

13. రాజ్యాంగ సవరణ మొదటగా ఎక్కడ నుంచి ప్రారంభమవుతుంది?
1) రాజ్యసభలో 2) లోక్‌సభలో
3) రాజ్యసభలో లేదా లోక్‌సభలో
4) రాజ్యసభలో, లోక్‌సభలో లేదా రాష్ట్ర శాసనసభలో

14. జాతీయ వేతన సవరణ కమిషన్ మొదటి చైర్మన్ ఎవరు?
1) రవీంద్ర వర్మ
2) వి.టి. కృష్ణమాచారి
3) ఎస్.ఎన్. ముఖర్జీ
4) వరదాచారి అయ్యర్

15. కింది వాటిలో నిర్ణీత కాల పరిమితి లేని పదవి ఏది?
1) అటార్నీ జనరల్
2) యూపీఎస్సీ చైర్మన్
3) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
4) ప్రధాన ఎన్నికల కమిషనర్

16. జిల్లా కలెక్టర్ ఏ శాఖ పరిధిలోకి వస్తాడు?
1) రెవెన్యూ 2) ఫైనాన్స్
3) ప్రణాళిక శాఖ
4) సాధారణ పరిపాలన శాఖ

17. కింది వాటిలో ప్రాథమిక హక్కు ఏది?
1) ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు
2) ఎస్సీ, ఎస్టీలకు లోక్‌సభ, అసెంబ్లీల్లో రిజర్వేషన్లు
3) ఎస్సీ, ఎస్టీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు
4) పైవన్నీ

18. కేంద్ర, రాష్ట్రాల సంబంధాల పునఃపరిశీలనకు ఎం.ఎం. పూంఛీ కమిషన్‌ను వేసిన ప్రధాని ఎవరు?
1) అటల్ బిహారీ వాజ్‌పేయి
2) మన్మోహన్ సింగ్
3) వి.పి. సింగ్ 4) దేవెగౌడ

19. కింది వారిలో 1966లో తాష్కెంట్ ఒప్పందంపై సంతకాలు చేసిందెవరు?
1) ఎల్.బి. శాస్త్రి, జుల్ఫికర్ అలీభుట్టో
2) ఎల్.బి. శాస్త్రి, ఆయూబ్ ఖాన్
3) ఇందిరాగాంధీ, జుల్ఫికర్ అలీ భుట్టో
4) ఇందిరాగాంధీ, ఆయూబ్ ఖాన్

20. లోక్‌సభకు తొలిసారి 'హంగ్' ఏ సంవత్సరంలో ఏర్పడింది?
1) 1977 2) 1971
3) 1989 4) 1991

21. కింది వాటిలో హైకోర్టు లేని నగరం ఏది?
1) రాంచీ 2) బిలాస్‌పూర్
3) డెహ్రాడూన్ 4) అహ్మదాబాద్

22. 'ఆపరేషన్ విజయ్' ద్వారా భారత్‌లో విలీనమైన రాష్ట్రం?
1) పుదుచ్చేరి 2) సిక్కిం
3) గోవా 4) జమ్ము-కశ్మీర్

23. కింది వారిలో భారత్‌లో వైస్రాయ్, గవర్నర్ జనరల్‌గా పనిచేసిన వారెవరు?
1) లార్డ్ కానింగ్, లార్డ్ రీడింగ్
2) లార్డ్ కానింగ్, మౌంట్ బాటెన్
3) మౌంట్ బాటెన్, లార్డ్ రీడింగ్
4) లార్డ్ వెల్లింగ్టన్, లార్డ్ మెకాలే

24. కొంతమంది విధాన పరిషత్ సభ్యులను విధాన సభ సభ్యులు ఎన్నుకునే విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
1) జర్మనీ 2) దక్షిణాఫ్రికా
3) నార్వే 4) ఫ్రాన్స్

25. రాజ్యాంగాన్ని అధికారికంగా హిందీ, అరబిక్ భాషల్లోకి తర్జుమా చేసిన సంవత్సరాలు వరుసగా?
1) 1987, 2007 2) 1987, 2014
3) 1997, 2014 4) 1997, 2007

26. 1946లో భారతదేశంలో తాత్కాలిక ప్రభుత్వం దేని ప్రకారం ఏర్పడింది?
1) రాజాజీ ఫార్ములా
2) వేవెల్ ప్లాన్
3) కేబినెట్ మిషన్ ప్లాన్
4) మౌంట్ బాటెన్ ప్లాన్

27. "Constitution Government in India" గ్రంథ రచయిత ఎవరు?
1) బార్కర్ 2) గ్రాన్‌విల్ ఆస్టిన్
3) జె.ఆర్. శివాక్ 4) ఎం.వి. పైలీ

28. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు నిబంధనలను తెలిపే ఆర్టికల్ ఏది?
1) 307 2) 309
3) 314 4) 317

29. కొత్తగా ఒక రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే సవరించాల్సిన షెడ్యూళ్లు ఏవి?
1) 1, 2 2) 1, 3
3) 1, 4 4) 1

30. భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో ఉన్న 22 భాషల్లో కింది వాటిలో లేని భాషలు?
1) ఇంగ్లిష్, రాజస్థానీ
2) కశ్మీరీ, ఉర్దూ
3) సంస్కృతం, కొంకణి
4) డోగ్రీ, సంతాలీ

31. భారత రాజ్యాంగంలో అంతర్రాష్ట్ర వ్యాపారం గురించి ఏ భాగంలో పేర్కొన్నారు?
1) 12 2) 13
3) 14 4) 15

32. రాజకీయ పార్టీలు, అవి ఏర్పడిన సంవత్సరాల సరైన వరస క్రమం ఏది?
ఎ) డి.ఎం.కె బి) అకాలీదళ్
సి) శివసేన డి) నేషనల్ కాన్ఫరెన్స్
1) బి, సి, ఎ, డి 2) ఎ, బి, డి, సి
3) బి, డి, ఎ, సి 4) బి, ఎ, సి

33. కింద పేర్కొన్న ఏయే సంవత్సరాల్లో మనదేశం అణు ప్రయోగం నిర్వహించింది?
1) 1974, 1996 2) 1976, 1996
3) 1974, 1998 4) 1976, 1998

34. ఆర్టికల్స్‌కు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
1) బిరుదుల నిషేధం – ఆర్టికల్ 18
2) బాల కార్మిక వ్యవస్థ నిషేధం – ఆర్టికల్ 23
3) మద్యపాన నిషేధం – ఆర్టికల్ 47
4) వివక్షత నిషేధం – ఆర్టికల్ 15

35. భారత రాష్ట్రపతికి ఏ బిల్లుల విషయంలో నిరపేక్ష వీటో అధికారం ఉంటుంది?
1) పబ్లిక్ బిల్లులు
2) ప్రైవేట్ బిల్లులు 3) సాధారణ బిల్లులు
4) పైవన్నీ

36. 'పోటా' బిల్లు విషయంలో పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశానికి అధ్యక్షత వహించింది వారెవరు?
1) జి.ఎం.సి. బాలయోగి
2) పి.ఎ. సంగ్మా 3) పి.ఎం. సయీద్
4) మనోహర్ జోషీ

37. ఆర్టికల్ 360 ప్రకారం, రాష్ట్రపతి విధించే ఆర్థిక అత్యవసర పరిస్థితి గరిష్ట కాల పరిమితి?
1) ఏడాది 2) రెండేళ్లు
3) మూడేళ్లు 4) అనిశ్చితం

38. అతి ఎక్కువ వయసులో భారత ప్రధాని అయిన వ్యక్తి?
1) చరణ్‌సింగ్ 2) మొరార్జీ దేశాయ్
3) అటల్ బిహారీ వాజ్‌పేయి
4) చంద్రశేఖర్

39. "A Foreign Policy of India" పుస్తక రచయిత ఎవరు?
1) ఐ.కె. గుజ్రాల్ 2) వి.పి. సింగ్
3) జవహర్ లాల్ నెహ్రూ
4) దేవెగౌడ

40. మైనారిటీ ప్రభుత్వం అంటే?
1) మైనారిటీలకు ప్రాధాన్యం ఇచ్చేది
2) మైనారిటీలు అధికారం చేపట్టడం
3) సాధారణ మెజారిటీ కూడా లేని ప్రభుత్వం
4) సంకీర్ణ ప్రభుత్వానికి మరోపేరు

41. కింది వాటిలో ఇప్పటి వరకు తెలుగువారు చేపట్టని పదవులు ఏవి?
ఎ) లోక్‌సభ స్పీకర్
బి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
సి) ఉపరాష్ట్రపతి
డి) ఉప ప్రధానమంత్రి
1) బి, డి 2) ఎ, బి
3) ఎ, డి 4) డి

42. పార్లమెంట్‌లో నిర్వహించే 'జీరో అవర్'ను ఏ సంవత్సరం నుంచి ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు?
1) 1994 2) 2004
3) 2008 4) 2010

43. పండిట్ గోవింద్ వల్లభ్ పంత్ పేరుతో ఇచ్చే 'ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు' పొందిన ఏకైక మహిళ ఎవరు?
1) ఇందిరాగాంధీ 2) మీరాకుమార్
3) సుమిత్రా మహాజన్
4) సుష్మా స్వరాజ్

44. ప్రత్యేక సెలవుతో కూడుకున్న వివాదాల (SLP) గురించి తెలిపే ఆర్టికల్ ఏది?
1) 134 2) 136
3) 137 4) 138

45. తొలి రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాల్ చేసిన కేసు?
1) చంపకం దొరై రాజన్ కేసు
2) ఎ.కె. గోపాలన్ కేసు
3) బెలా బెనర్జీ కేసు
4) శంకరీ ప్రసాద్ కేసు

46. 'మంత్రాలయం' అని ఏ రాష్ట్ర సచివాలయ భవనాన్ని పిలుస్తారు?
1) మధ్యప్రదేశ్ 2) మహారాష్ట్ర
3) కర్ణాటక 4) ఉత్తరప్రదేశ్

47. 'ఉన్నత విద్యా పరిశోధన' ఏ జాబితాలోని అంశం?
1) కేంద్ర జాబితా 2) రాష్ట్ర జాబితా
3) ఉమ్మడి జాబితా 4) అవశిష్ట అంశం

48. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదిక 'శవపరీక్ష' లాంటిదని విమర్శించిన వారెవరు?
1) వి.కె. షుంగ్లూ 2) పాల్ ఆపిల్ బీ
3) సి.జి. సోమయ్య
4) ఎం.పి. శర్మ

49. స్థానిక సంస్థల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించిన తొలి రాష్ట్రం ఏది?
1) రాజస్థాన్ 2) మధ్యప్రదేశ్
3) కేరళ 4) బిహార్

50. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఏ సంవత్సరంలో అమల్లోకి వచ్చింది?
1) 2010 2) 2011
3) 2012 4) 2013

సమాధానాలు

1) 2	2) 2	3) 4	4) 1	5) 3
6) 2	7) 3	8) 4	9) 4	10) 1
11) 3	12) 2	13) 3	14) 4	15) 1
16) 4	17) 1	18) 2	19) 2	20) 3
21) 3	22) 3	23) 2	24) 3	25) 2
26) 3	27) 4	28) 2	29) 3	30) 1
31) 2	32) 3	33) 3	34) 2	35) 2
36) 3	37) 4	38) 2	39) 1	40) 3
41) 4	42) 2	43) 4	44) 2	45) 4
46) 2	47) 1	48) 2	49) 4	50) 3



W s h



N. Vijayender Reddy

GENERAL AWARENESS

1. Union Home Minister Rajnath Singh attended a meeting of the Shanghai Cooperation Organization (SCO) on disaster prevention and relief held in August 2017 in Cholpon Ata, a resort town in:
1) Kazakhstan 2) Tajikistan
3) Kyrgyzstan 4) Uzbekistan
5) None of these

2. Who was sworn in as the 45th Chief Justice of India on August 28, 2017?
(He succeeded Justice J.S. Khehar)
1) Justice Deepak Gupta
2) Justice Dipak Misra
3) Justice Arun Mishra
4) Justice Ranjan Gogoi
5) Justice Kurian Joseph

3. Who won the 2017 Mark Twain Prize for American Humor?
(It is awarded by the John F. Kennedy Center for the Performing Arts)
1) Bill Murray
2) Eddie Murphy
3) David Letterman
4) Neil Simon
5) None of these

4. Where was the 2017 Global Platform for Disaster Risk Reduction held?
1) Geneva, Switzerland
2) New York, USA
3) Cancun, Mexico
4) Havana, Cuba
5) Nairobi, Kenya

5. Prime Minister Narendra Modi laid the foundation stone of the Indian Agricultural Research Institute (IARI) on May 26, 2017 at Gogamukh in:
1) Bihar
2) Odisha 3) West Bengal
4) Assam
5) Arunachal Pradesh

6. Who was the winner of the first ever genderless award at the MTV Movie & TV Awards in May 2017?
1) Emma Stone
2) Megan Fox
3) Emma Watson
4) Anne Hathaway
5) Natalie Portman

7. Who is the first Bollywood actor to speak at the TED Talks?
(TED stands for Technology, Entertainment and Design)
1) Akshay Kumar
2) Shah Rukh Khan
3) Aamir Khan
4) Amitabh Bachchan
5) None of these

8. The Organization of American States (OAS) is headquartered in:
1) Ottawa 2) Santiago
3) Mexico City
4) Washington, D.C.
5) Buenos Aires

9. Which country announced its intention to withdraw from the Organization of American States in April 2017?
1) Bolivia 2) Cuba
3) Venezuela 4) Costa Rica
5) Ecuador

10. Donald Trump became the first sitting US President to visit the Western Wall in May 2017. It is a holy site located in:
1) Israel 2) Vatican
3) Saudi Arabia
4) Germany 5) Italy

11. S. Ramassamy passed away on May 15, 2017. He was the former Chief Minister of:
1) Kerala 2) Puducherry
3) Tamil Nadu 4) Goa
5) Karnataka

12. The United Nations Organization has established a medal in recognition and commemoration of those who have lost their lives as a result of UN peacekeeping operations. It is named after which of the following Secretaries-General of the UNO?
1) Trygve Lie
2) Dag Hammarskjold
3) U Thant
4) Kurt Waldheim
5) Boutros Boutros-Ghali

13. The International Day of United Nations Peacekeepers is celebrated on:
1) March 29 2) April 29
3) May 29 4) June 29
5) July 29

14. Jonathan Demme passed away recently. He won the Academy Award for Best Director in 1991 for which of the following films?
1) Philadelphia
2) Beloved
3) A Master Builder
4) The Silence of the Lambs
5) Rachel Getting Married

15. Who became the first woman to climb Mount Everest eight times in May 2017?
1) Maya Gurung
2) Pema Diki Sherpa
3) Lhakpa Sherpa
4) Nimdoma Sherpa
5) Pujan Acharya

16. Which is the first country to have national plan for disaster risk reduction?
1) Australia 2) Canada
3) UK 4) India
5) Mexico





17. Who has been appointed as the Director General of the Indo-Tibetan Border Police (ITBP)?
1) R.K. Pachnanda
2) Rajiv Jain
3) K. Durga Prasad
4) Anil Dasmana
5) Rajiv Rai Bhatnagar

18. Which former Union Minister is the author of the book "Hope in a Challenged Democracy: An Indian Narrative"?
1) Natwar Singh
2) Jairam Ramesh
3) P. Chidambaram
4) Ashwani Kumar
5) Jaswant Singh

19. The 15th edition of Indo-French naval exercise was held in April 2017. It is known as:
1) Indra 2) Yudh Abhyas
3) Varuna 4) Sampreeti
5) Konkan

20. Which of the following days was celebrated on April 22, 2017?
1) Science Day
2) Earth Day
3) Technology Day
4) Diabetes Day
5) None of these

21. Who received the P.C. Chandra Puraskar in April 2017?
1) Kailash Satyarthi
2) Gulzar
3) Sourav Ganguly 4) Rekha
5) Hema Malini

22. Which of the following countries currently has an Indian-Origin Prime Minister?
1) Canada 2) Ireland
3) Poland 4) Australia
5) New Zealand

23. Which State government has signed a Memorandum Of Understanding (MOU) with IIT Kharagpur for the development of a Happiness Index?
1) Punjab 2) Haryana
3) Madhya Pradesh
4) Andhra Pradesh
5) West Bengal

24. Hubert Minnis was elected as the new Prime Minister of which of the following countries in May 2017?
1) Haiti 2) Cuba
3) Panama 4) Bahamas
5) Dominican Republic

25. Kumarakom Bird Sanctuary is situated in which of the following States?
1) Tamil Nadu
2) Kerala 3) Goa
4) Karnataka
5) Rajasthan

26. Who was crowned Miss teen Universe 2017 in Managua, the capital city of Nicaragua?
1) Samantha Pierre (Canada)
2) Ary Trava (Mexico)
3) Srishti Kaur (India)
4) Nicole Obando (Costa Rica)
5) None of these

27. Who is the Present Prime Minister of France?
1) Emmanuel Macron
2) Edouard Philippe
3) Bernard Cazeneuve
4) Manuel Valls
5) Francois Hollande

28. Who was conferred with the first Bhairon Singh Shekhawat Lifetime Achievement Honor in Public Service in May 2017?
1) Vasudhara Raje
2) Mamata Banerjee
3) Manik Sarkar
4) Pawan Kumar Chamling
5) Naveen Patnaik

29. Which private bank has launched a new trading platform called "Selfie" for its customers?
1) Yes Bank
2) Axis Bank
3) Federal Bank
4) Kotak Mahindra Bank
5) South Indian Bank

30. According to a recently released survey, which railway station is the dirtiest among 75 busiest stations in India?
1) Bhopal 2) Indore
3) Darbhanga 4) Beas
5) Jammu

31. Which of the following micro finance institutions became a commercial bank?
1) Disha 2) Janalakshmi
3) Ujjivan 4) Bandhan
5) Equitas

32. In which country is the International Criminal Court (ICC) located?
1) Italy 2) Netherlands
3) France 4) Switzerland
5) Russia

33. Which of the following regulates commodities market?
1) FCI 2) IRDAI
3) SEBI 4) RBI
5) PFRDA

34. Vinay Mohan Kwatra has been appointed as India's Ambassador to?
1) Russia 2) Germany
3) Ukraine 4) France
5) Spain

35. "SIMBEX-17" is the bilateral naval exercise between India and:
1) South Korea
2) Sudan 3) Singapore
4) Seychelles
5) Slovakia

36. Which football team won the prestigious I-League title in April 2017?
1) Mohan Bagan
2) Minerva Punjab
3) Aizawl 4) East Bengal
5) Shillong Lajong

37. Valtteri Bottas Won the Russian Formula One Grand Prix title recently. He belongs to?
1) Russia 2) Finland
3) Australia 4) Argentina
5) Germany

38. Who won the Italian Open tennis title in Rome in May 2017?
1) Novak Djokovic
2) Rafael Nadal
3) Dominic Thiem
4) Alexander Zverev
5) Carlos Moya

39. Who won the Reykjavik Open Chess tournament in Iceland in April 2017?
1) Anish Giri
2) Abhijeet Gupta
3) Gata Kamsky
4) John Pigott
5) None of these


40. Which Indian won the Women's title in the Asian Continental Blitz Chess championship in Chengdu, China in May 2017?
1) Padmini Rout
2) Dronavalli Harika
3) Mary Ann Gomes
4) R. Vaishali
5) Soumya Swaminathan

KEY

1) 3	2) 2	3) 3	4) 3
5) 4	6) 3	7) 2	8) 4
9) 3	10) 1	11) 2	12) 2
13) 3	14) 4	15) 3	16) 4
17) 1	18) 4	19) 3	20) 2
21) 1	22) 2	23) 3	24) 4
25) 2	26) 3	27) 2	28) 4
29) 3	30) 3	31) 4	32) 2
33) 3	34) 4	35) 3	36) 3
37) 2	38) 4	39) 1	40) 4

నీడను గుర్తించండి

పక్కన ఇచ్చిన 4 నీడల్లో రంగులలో ఉన్న కుందేలు నీడ ఏదో గుర్తించండి



గుర్తించండి

కింద ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి

car	h	o	m	e	a	b
lip	m	y	p	p	r	q
worm	r	o	i	a	s	y
yoyo	o	y	l	n	s	u
home	w	o	t	d	u	i
panda	c	a	r	a	e	f

దారి కనుక్కోండి

మధ్యలో ఉన్న వంకాయ, ఉల్లిగడ్డ, బీరకాయ దగ్గరికి బయటి నుంచి టమాటా వెళ్లాలి. వెళ్లే దారి చూపండి.



నాన్నా చెప్పవా?

పేరుపెట్టి పిలిస్తే పందులు స్పందిస్తాయా?



మనుషులను పక్కన పెడితే, మిగతా జంతువులలోకి చింపాంజీలు చాలా తెలివైనవి. ఇక ఆ తరువాత మూడు స్థానాలనూ వరుసగా డాల్ఫిన్లు, ఏనుగులు, పందులు ఆక్రమిస్తాయి. అంటే తెలివైన జంతువుల్లో పందులది నాలుగో స్థానమన్న మాట. మనం పెంచుకునే జంతువులకు గాని, మనకు తరచూ ఎదురయ్యే జంతువులకిగానీ మనం ఏదన్నా పేరు పెట్టి పిలవడం మొదలుపెడితే దానిని అర్థం చేసుకోడానికి, అంటే అది 'తన పేరే' అని తెలుసుకోవడానికి ఒక్కో జంతువుకీ ఒక్కో సమయం పడుతుంది. ఆవులు, గేదెలు, మేకలు, ఎలుకలు, కుక్కలు, పిల్లులు, గుర్రాల వంటి ఎన్నో జంతువులు ...మనమేదైనా పేరు పెట్టి పిలిస్తే చక్కగా స్పందిస్తాయి. ఆఖరికి కొన్ని పక్షులు కూడా తమకుపెట్టిన పేరుని అర్థం చేసుకోగల్గుతాయి. అయితే దీనిని గుర్తించడానికి కొన్ని జంతువులు కేవలం కొన్ని వారాల సమయమే తీసుకుంటే మరికొన్ని జంతువులు కొన్ని నెలల సమయాన్ని తీసుకుంటాయి. అంతే తేడా. మనం పెంచుకునే పందికి గాని, రోజూ మన ఇంటి ముందు నుంచి పోయే పందికిగాని ఓ పేరుని పెట్టి పిలవడం మొదలు పెడితే కేవలం రెండు–మూడు వారాలలోనే దానికి ఆ విషయం అర్థమవుతుంది. మన పిలుపుకి, మాటలకి తగినట్లుగా అది స్పందించడం కూడా మొదలుపెడుతుంది. కుక్కలు తమ 'పేరుని' గుర్తించడానికి సాధారణంగా నెల రోజులకుపైగా సమయాన్ని తీసుకుంటాయి. వాటితో పోలిస్తే ఈ విషయంలో పందులు చాలా తెలివైనవని చెప్పవచ్చు. అన్నట్లు మనుషులకు ఎంతో అవసరమైన ఇన్సులిన్‌తో సహా, 40 రకాలకు పైగా మందుల తయారీకి పందులు ఉపయోగపడుతున్నాయి. ఆఖరికి, పాడైన మనిషి గుండె తాలూకు కవాటాలకు బదులుగా పందుల గుండె కవాటాలను అమర్చేందుకూ వీలవుతుంది.

మీకు తెలుసా?



మోటార్ సైకిల్ హెల్మెట్‌ను ఒక న్యూరోసర్జన్ కనుగొన్నాడు



ఇండోనేషియాలో నీలిరంగు లావాను వెదజల్లే అగ్నిపర్వతం ఉంది

హోండా 1949లో తన మొదటి మోటార్ సైకిల్‌ను ఉత్పత్తి చేసింది. 15 సంవత్సరాలకే ఉత్పత్తుల్లో ప్రపంచ నెం.1 స్థాయికి చేరుకుంది




కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 6 తేడాలను గుర్తించండి





కనుక్కోండి

పక్కన ఉన్న బొమ్మల్లో ఒకేలా ఉన్న రెండు బొమ్మలను కనుక్కోండి.




రంగులు వేయండి





కింద ఇచ్చిన కోతి బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



రూర్బన్ పనులు పూర్తి చేయండి



రూర్బన్ పథకంపై అధికారులతో కలెక్టర్ దివ్య సమీక్ష

- కలెక్టర్ దివ్యదేవరాజన్ ఆదేశం
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

సాక్షి, వికారాబాద్: రూర్బన్ పథకం కింద జిల్లాలో చేపట్టిన పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ దివ్యదేవరాజన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పథకం కింద చేపట్టిన ఆస్పత్రి నిర్మాణం, పునరుద్ధరణ పనులను పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ ద్వారా చేయాల్సిన పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ పథకం కింద చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని స్వచ్ఛంద సంస్థలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలకు సంబంధించిన నిర్మాణాలు, మరమ్మతు పనులు, వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణాలు, లింక్ రోడ్లు తదితర పనులను తక్షణమే పూర్తిచేయాలని తెలిపారు. గ్రామాల్లో డంపింగ్‌యార్డులు, శ్మశానవాటికల నిర్మాణాలు పూర్తిచేయాలని, వీటిలో షెడ్యూల్డ్ కులాలవారికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జాన్సన్, పౌరసరఫరాల జిల్లా అధికారి పద్మజ, పంచాయతీరాజ్ ఈఈ మనోహర్‌రావు, మైనింగ్ ఏడీ శామ్యూల్‌జాకబ్, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి సుబ్బారావు, డీఎంహెచ్‌ఓ దశరథ్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారి జ్యోత్స్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి

వికారాబాద్ అర్బన్: పత్తి కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ దివ్య అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు, కాటన్ మిల్లర్లు, సీసీఐ ప్రతినిధులతో మంగళవారం తన చాంబర్‌లో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 46,583 హెక్టార్లలో పత్తి పంట సాగైందని తెలిపారు. నవంబర్ మొదటి వారంలో పంట దిగుబడి చేతికి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సంవత్సరం లక్షా ఇరవై వేల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని ఆశిస్తున్నట్లు తెలిపారు. పత్తి కొనుగోలు కోసం ఇప్పటికే వికారాబాద్, తాండూరు, పరిగిలో 5 కాటన్ మిల్లులు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైతే మర్పల్లి, బషీరాబాద్, కొడంగల్, కోట్‌పల్లిలో అదనపు సెంటర్ల ఏర్పాటుకు పరిశీలన చేయాలని సూచించారు. కొనుగోళ్లు ప్రారంభమయ్యే సమయానికి గోదాంల వద్ద రవాణా, స్టోరేజ్ తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఇందుకోసం రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని చెప్పారు. ప్రస్తుతం పత్తి క్వింటాలు మద్దతు ధర రూ.4,320 ఉందని తెలిపారు. పత్తి కొనుగోలు ప్రారంభమైననాటికి తూకపు మిషన్ల కొరత లేకుండా చూడాలన్నారు. కాటన్ మిల్లుల్లో ఎక్కువ మొక్కలు నాటాలని తెలిపారు. మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి, వ్యవసాయ శాఖ ఏడీ భారతి, సీసీఐ ఇన్‌చార్జ్ శరత్, కాటన్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.


దేశానికే గర్వకారణం ధ్యాన్‌చంద్

- ప్రతీ క్రీడాకారుడికి ఆయన ఆదర్శప్రాయుడు
- టీఆర్‌ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు హరీశ్వర్‌రెడ్డి
- పరిగిలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న హరీశ్వర్‌రెడ్డి, క్రీడాకారులు, పీడీలు

పరిగి: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ను ప్రతీ క్రీడాకారుడు ఆదర్శంగా తీసుకోవాలని టీఆర్‌ఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి అన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా మంగళవారం పరిగిలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ఆయా పాఠశాలల విద్యార్థులు, క్రీడాకారులు, ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు. ధ్యాన్‌చందర్ దేశానికే గర్వకారణమని కొనియాడారు. విద్యార్థులు త్రివర్ణ పతకాన్ని చేతబూని ఊరేగింపు తీశారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంజిలయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.ఆంజనేయులు, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొప్పుల అనీల్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు భాస్కర్, కాంగ్రెస్, టీఆర్‌ఎస్ నాయకులు బంగ్ల యాదయ్య, ఈ.కృష్ణ, బీ.రవికుమార్, ఆంజనేయులు, పృథ్వీ, నరేష్, సంజీవ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి వికారాబాద్

బుధవారం | ఆగస్టు | 30 | 2017

మన కొడంగల్

వాగులో చెత్తను తొలగించాలి



కొడంగల్ రూరల్: మండల పరిధిలోని చిట్లపల్లి అనుబంధ ఖాజాఅహ్మద్‌పల్లికి వెళ్లే దారిలో ఉన్న వాగులో వర్షపు నీటికి చెత్త కొట్టుకు వచ్చి అక్కడే ఆగిపోయింది. చెత్తను తొలగించక పారడంతో ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించాలి.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9553955753

బావులతో భయం

- ప్రమాదకరంగా పాడుబడిన బావులు
- ప్రమాదాలు జరిగినా స్పందించని యంత్రాంగం

కొడంగల్ రూరల్: రహదారుల పక్కన, ఇళ్ల మధ్యనే ఉన్న పాడుబడిన బావులతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. పలుమార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు స్పదించడం లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి, చిట్లపల్లి, అంగడి రాయిచూర్, టేకుల్‌కోడ్, పర్సాపూర్, పాటిమీదిపల్లి తదితర గ్రామాల్లో ఇళ్ల మధ్య, రోడ్ల పక్కనే పాడుబడిన బావులు ఉన్నాయి. కొండారెడ్డిపల్లి శివారులో రహదారి పక్కనే ఉన్న పాడుబడిన బావి, గ్రామం చివరన మరో బావి.. ఊరిలో ఇళ్ల మధ్యనే ఇంకో బావి ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో పాడుబడిన బావిలో ఓ ఆవు ప్రమాదవశాత్తు పడిపోయింది. తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొడంగల్‌కు కూతవేటు దూరంలో ఉన్న కొండారెడ్డిపల్లి గ్రామస్తులు వివిధ పనుల నిమిత్తం నిత్యం నియోజకవర్గ కేంద్రానికి వస్తుంటారు. రహదారి పక్కనే నిరుపయోగంగా బావి ఉండడంతో భయాందోళన చెందుతున్నారు. దీంతోపాటు గ్రామంలో ఇళ్లమధ్యనే మరో బావి ఉందని చెబుతున్నారు. ఈనేపథ్యంలో పిల్లలను ఇంటి వద్ద ఉంచి పొలాలకు వెళ్లేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. స్థానికులు జాగ్రత్తపడుతున్నా కొత్తవారికి తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. నిరుపయోగంగా ఉన్న బావులను పూడ్చివేయాలని మండలవాసులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. చిట్లపల్లిలో ఇళ్ల మధ్యనే ప్రమాదకరంగా బావి ఉంది. అంగడిరాయిచూర్ ఆటోస్టాండు సమీపంలో ఓ బావి, గేటు నుంచి గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టు సమీపంలో మరోబావి ప్రమాదకరంగా ఉంది. పర్సాపూర్‌లో పాఠశాల సమీపంలో, టేకుల్‌కోడ్‌లో ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఇళ్లమధ్యనే నిరుపయోగంగా ఉన్న బావులు ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొండారెడ్డిపల్లిలో రోడ్డు పక్కనే బావి

ఎవరు బాధ్యులు?



ఇళ్ల మధ్యన, రహదారి పక్కన ఉన్న పాడుబడిన బావులతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నాం. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు...? అధికారులు స్పందించాలి. **–సంజీవరెడ్డి, కొండారెడ్డిపల్లి**

న్యూస్ బాక్స్

మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడండి



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

కొడంగల్: అందరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని పట్టణ సర్పంచ్ వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో వివిధ రకాల మొక్కలను స్థానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలో 40 వేల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు పలు ప్రాంతాల్లో 30వేల మొక్కలను నాటినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కలన నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బాలప్ప, వార్డు సభ్యులు నర్సింగ్‌రావు, అశోక్, పంచాయతీ సిబ్బంది నాగరాజ్, సుభాష్, ఆశప్ప, శకనప్ప, మేట్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ టీకాతో చిన్నారులకు రక్ష



చిన్నారులకు టీకాలను వేస్తున్న వైద్య సిబ్బంది

కొడంగల్ రూరల్: మీజిల్స్, రుబెల్లా టీకా చిన్నారులకు రక్షగా నిలుస్తుందని అంగడి రాయిచూర్ ఆస్పత్రి వైద్యురాలు సరస్వతి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఇందనూర్‌లో చిన్నారులకు, పదిహేనేళ్లలోపు పిల్లలు, విద్యార్థులకు టీకాలను వేశారు. ఈ టీకాతో చిన్నారులకు వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని అన్నారు. ప్రతిఒక్కరూ చిన్నారులకు టీకాలను వేయించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కూలి డబ్బుల కోసం నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

కొడంగల్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఆరు నెలలుగా కూలి డబ్బులు అందడం లేదని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కూలీలు మంగళవారం ఆందోళనకు దిగారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారికి సకాలంలో డబ్బులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హరితహారం పథకంలో గుంతలు తవ్విన డబ్బులు సైతం రావడం లేదన్నారు. ఈనేపథ్యంలో కూలీలు స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పనిచేసిన కూలీరోజులకు స్లిప్పులు ఇవ్వడం లేదని వాపోయారు. ఈ విషయమై సర్పంచ్ వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సర్పంచ్ ఫీల్డ్ అసిస్టెంట్ బాలప్పతో మాట్లాడారు. స్లిప్పులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించగా.. టెక్నికల్ అసిస్టెంట్ కంప్యూటర్‌లో నమోదు చేయలేదని సమాధానం ఇచ్చారు. కూలి డబ్బుల విషయమై ఉన్నత అధికారులతో మాట్లాడి త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

చెత్త సేకరణ రిక్షాల పంపిణీ



రిక్షాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

దౌల్తాబాద్: మండల పరిధిలోని ఆయా పంచాయతీలకు చెత్తసేకరణ రిక్షాలను మంగళవారం ఎంపీపీ నర్సింగ్‌భాన్ సింగ్, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటమ్మ, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సర్కార్ చెత్త సేకరణ రిక్షాలను పంపిణీ చేసిందన్నారు. దీంతో స్వచ్ఛభారత్ సాధ్యమని తెలిపారు. ప్రతిఒక్కరూ చెత్తసేకరణ రిక్షాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా పంచాయతీలకు 35 రిక్షాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ పార్వతమ్మ, భీమమ్మ ఉన్నారు.

లోకల్ వాయిస్

లైన్‌మన్‌ను నియమించాలి



కొడంగల్ మండల పరిధిలోని రావులపల్లి సబ్‌స్టేషన్‌లో లైన్‌మన్ లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. రెండు నెలలుగా పలు ప్రాంతాల్లో ఎర్తింగ్ కనెక్షన్ ఫెయిల్ అయిన సందర్భాల్లో ఫోన్ ద్వారా సమాచారం అందించినా ఫలితం లేకుండా పోతోంది. వెంటనే లైన్‌మన్‌ను ఏర్పాటు చేయాలి.

-అశోక్‌గౌడ్, రావులపల్లి

అదనంగా బస్సును నడపాలి



పాఠశాలల సమయంలో రుద్రారం, బాపల్లి, నీటూర్, చంద్రకల్ తదితర రూట్లలో అదనంగా బస్సును నడిపించాలి. విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈవిషయంలో పలుమార్లు విద్యార్థులు నిరసనలు వ్యక్తం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆర్టీసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

-రమేష్, హస్నాబాద్

వీసీఓలను పర్మినెంట్ చేయాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న సాక్షర భారత్ సిబ్బంది

బొంరాస్‌పేట:సాక్షరభారత్‌లో పని చేస్తున్న మండల కోఆర్డినేటర్లు, గ్రామ కోఆర్డినేటర్లను పర్మినెంటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది డిమాండ్ చేశారు. మంగళవారం వీసీఓలు మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వీసీఓలకు వేతనాలు పెంచి ప్రతినెల చెల్లించాలని కోరారు. వయోజన విద్యా కేంద్రాలను గ్రంథాలయాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినందనరావుకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో దళితసంఘాల నాయకులు చంద్రయ్య, నాగప్ప, వెంకటయ్య తదితరులు మద్దతు తెలిపారు. వీసీఓల సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వీసీఓలు చంద్రయ్య, వెంకటయ్య ఉన్నారు.



ప్రారంభానికి ముందే శిథిలం

కొడంగల్ రూరల్:మండల పరిధిలోని అంగడిరాయిచూర్ పాఠశాల సముదాయంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ భవనం ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంది. మూడేళ్ల క్రితం రూ.5లక్షల వ్యయంతో అంగన్‌వాడీ భవనం నిర్మించారు. మరుగుదొడ్ల సమీపంలోనే ఏర్పాటు చేయడంతో సమస్య తలెత్తింది.

Zone Guide

సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బొంరాస్‌పేట:సర్వశిక్షా అభియాన్(ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎస్‌ఏ కాంటాక్ట్ ఉద్యోగుల మండల జేఏసీ నాయకులు మంగళవారం తహసీల్దార్, ఎంపీడీఓకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జీఓ నంబర్ 14ను అమలు చేసి ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులతో సమానంగా తమను గుర్తించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో పాటు ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. సీఆర్‌పీలు బావూసింగ్, నర్సింలు తదితరులు ఉన్నారు.

పార్వతీ తనయుడికి వీడ్కోలు


అంగడిరాయిచూర్‌లో బోనమ్మ ఆలయం వద్ద..


చిట్లపల్లిలో శ్రీశైలం పుణ్యక్షేత్రానికి తరలివెళ్తున్న గణనాథుడు

కొడంగల్ రూరల్: నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాల్లో మంగళవారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండల పరిధిలోని అంగడిరాయిచూర్, చిట్లపల్లి గ్రామాల్లో గత శుక్రవారం ప్రతిష్టించిన పలు వినాయక విగ్రహాలను మంగళవారం ఆయా మండపాల నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. అంగడిరాయిచూర్ ఎస్సీ కాలనీ బోనమ్మ ఆలయం ఎదుట ప్రతిష్టించిన వినాయక విగ్రహం వద్ద స్థానికుడు చుక్కయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. అనంతరం గ్రామంలోని తెలంగ్‌వాడీ, ఎస్సీ కాలనీలలోని వినాయక విగ్రహాలను గ్రామ శివారులో ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలోని ఇంద్రనగర్ కాలనీ ప్రతిష్టించిన పార్వతీతనయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. చిట్లపల్లిలో రేణుకా ఎల్లమ్మ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నిమజ్జనం కోసం తీసుకెళ్లారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కొనింటి రామప్ప, బొర్ర వెంకటప్ప, తలారి యాదయ్య, నర్సప్ప, అబ్దులప్ప, మహేష్, పకీరప్ప ఉన్నారు.

కొడంగల్:మండల కేంద్రంలోని కలాల్‌వాడీలో చిన్నారులు, విద్యార్థులు ప్రతిష్టించిన వినాయకుడిని మంగళవారం సాయంత్రం నిమజ్జనానికి తరలించారు. ఉదయం గణనాథునికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆ తర్వాత ట్రాకర్‌లో నిమజ్జనానికి ఊరేగింపుగా తరలించారు.ఈక్రమంలో మహిళలు గణనాథుడికి మంగళహారతులు ఇచ్చారు.


రేగడిమైలారంలో వినాయకుడి ఊరేగింపు

దౌల్తాబాద్: ఐదు రోజుల పాటు పూజలు అందుకున్న వినాయకులకు మంగళవారం భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలోని నందారం, దౌల్తాబాద్ గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. నందారంలో సర్పంచ్ సరోజనమ్మ తదితరులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆ తర్వాత శోభాయత్ర నిర్వహించి చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఊరేగింపులో యువకులు నృత్యాలు చేశారు. తిమ్మారెడ్డి, జనార్దన్‌రెడ్డి, లాలాచారి ఉన్నారు.


బొట్లోని తండాలో ఉట్టికొడుతున్న యువకులు

బొంరాస్‌పేట:మండల పరిధిలోని బొటోల్ని తండా, ఎన్కెపల్లి, రేగడిమైలారం తదితర గ్రామాలు, తండాల్లో ఐదోరోజు మంగళవారం వినాయక నిమజ్జనాలను ఘనంగా నిర్వహించారు.మండపాల వద్ద లడ్డూలు, పండ్లు, శాలువాలు వేలంపాట నిర్వహించారు. బొట్లోని తండా, దేవులానాయక్ తండాల్లో బంజారా నృత్యాలు, బ్యాండు వాయిద్యాలు, యువకుల నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. నంతరం వినాయకులను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్: కంట్రీబ్యూటరీ పెన్షన్ విధానం(సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్ సీపీఎస్ఈఏ మండల అధ్యక్షుడు క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల విద్యావనరుల కేంద్రం ఎదుట, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో వేర్వేరుగా సెప్టెంబర్ 1న సామూహిక సెలవును విజయవంతం చేయాలంటూ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004లో సీపీఎస్ విధానం అమలుకు కేంద్రం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల అభీష్టానికి వదిలివేసిందని తెలిపారు. అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ వచ్చిందని, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం దానినే కొనసాగిస్తోందని మండిపడ్డారు. సీపీఎస్ విధానంతో పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు భరోసా లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్రామరెడ్డి, ఉద్యోగులు సిద్దు మల్లేష్, రాజు, శ్రీను, వెంకటప్ప, పీఆర్‌టీయూ నాయకులు సాయప్ప, పాండురంగం ఉన్నారు.

బొంరాస్‌పేట:సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం(టీఎస్ సీపీఎస్ఈఏ) మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేంద్రబాబు, శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1న చేపట్టిన సామూహిక సెలవు, నిరసన కార్యక్రమం పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2004 నుంచి నియమితులైన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ వారికి శాపంగా మార్చిందని ఆరోపించారు. అనంతరం సీపీఎస్ రద్దును కోరుతూ రాష్ట్ర వ్యాప్త ఆందోళన పోస్టర్లను విడుదల చేశారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాధాకృష్ణ, సుధాకర్, శ్రీహరిరెడ్డి, భూదేవి, నీలవేణి, మంజుల, భాగ్యలక్ష్మి ఉద్యోగులు పాల్గొన్నారు.

హలో సాక్షి..
పరిగి:
90102 99041,
94900 20475,
గండేడ్:
94418 34777
కుల్కచర్ల:
96661 51575
దోమ:
9490728922
పూడూరు:
98490 79773



వేతనం.. వెతలు



పరిగిలో సమ్మె చేస్తున్న సాక్షరభారత్ కో ఆర్డినేటర్లు

సమ్మె బాటలో సాక్షరభారత్ కోఆర్డినేటర్లు

- పని నిరంతరం.. జీతం అరకొర..
- వెట్టిచాకిరి చేయిస్తున్నా భద్రత కరువు
- సమస్యలు పరిష్కరించాలని కోఆర్డినేటర్ల డిమాండ్

పరిగి: సాక్షరభారత్ మండల, గ్రామ కోఆర్డినేటర్లు సమ్మె బాట పట్టారు. తమతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వం పనికి తగిన గుర్తింపు, వేతనాలు ఇవ్వనందునే ఆందోళనకు దిగినట్టు వారు చెబుతున్నారు. ఆరు నెలలుగా సాక్షరభారత్ కోఆర్డినేటర్ల వ్యవస్థను రద్దు చేస్తామంటూ ప్రభుత్వం పేర్కొంటుండటం కూడా వారి సమ్మెకు దారితీసింది. మూడు నెలల క్రితం సాక్షరభారత్ కార్యక్రమాలకు ముగింపు పలకటంతో పాటు కోఆర్డినేటర్లను తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తీవ్ర విమర్శల నేపథ్యంలో తొలగింపు గడువు మరో ఆరు నెలలకు పొడిగించింది. అయితే ఇప్పటికే వారి మెడపై తొలగింపు కత్తి వేళాడుతున్న నేపథ్యంలో వారు సమ్మె బాటపట్టారు. నియోజకవర్గంలో ప్రస్తుతం నాలుగు మండలాలు, 89 గ్రామ పంచాయతీల్లో 185 మంది మండల, గ్రామ కోఆర్డినేటర్లు విధులు నిర్వహిస్తున్నారు.

అక్షరాస్యతలో వెనుకడుగే....

ఆర్థికంగా వెనకబడిన దేశాలు, చిన్నా దేశాలు సైతం అక్షరాస్యతా విషయంలో మనకంటే ముందున్నాయి. విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చినా.. ఇప్పటికీ మన దేశ అక్షరాస్యతా 74 శాతమే.. అదే మన తెలంగాణ తీసుకుంటే 66.46 శాతం మాత్రమే.. విద్యాహక్కు చట్టం తరువాత 14 సంవత్సరాల లోపు పిల్లల అక్షరాస్యతా శాతం పెరుగుతూ వస్తున్నప్పటికీ వయోజనుల్లో ఎక్కువమంది నిరక్షరాస్యులు ఉన్నందున.. జనాభా సగటు అక్షరాస్యతా శాతాన్ని పెంచటం అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో వయోజనులను సైతం అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో పుట్టుకొచ్చిందే సాక్షరభారత్ కార్యక్రమం. కాగా అక్షరాస్యతా పరంగా మనం ఇంకా అట్టడుగునే ఉన్నప్పటికీ సాక్షరభారత్ కార్యక్రమాలకు ప్రభుత్వం స్వస్తి పలుకాలనుకోవటం పలు విమర్శలకు తావిస్తోంది.

డిమాండ్లు ఇవే..

– ప్రస్తుతం నెలకు రూ. 2వేలు వేతనం ఇస్తున్న గ్రామ కోఆర్డినేటర్లకు రూ. 10,500, రూ.6000 వేతనం అందుకుంటున్న మండల కోఆర్డినేటర్లకు రూ.25,000 ఇవ్వాలి.
–సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం నెలనెలా ఇవ్వాలి
–సాక్షరభారత్ కార్యక్రమాన్ని రద్దు చేయకుండా అక్షరాస్యత కార్యక్రమాలు కొనసాగించాలి.
–మండల, గ్రామ కో–ఆర్డినేటర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి.
– హెచ్ఆర్ పాలసీతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి.

అన్ని పనులూ మాతోనే..



పేరుకే సాక్షరభారత్ కోఆర్డినేటర్లు.. వాస్తవంలో గ్రామంలో ఏపని, ఏ సర్వే జరిగినా.. తమకే అంటగడుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ కార్యక్రమంలో కోఆర్డినేటర్లకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. అన్ని పనులు చేస్తున్నా నిందలేయటం పరిపాటిగా మారింది.

– ఆంజనేయులు, సాక్షరభారత్ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి

ఉద్యోగ భద్రత కల్పించాలి



తాము చేస్తున్న పనికి సమాన వేతనం ఇవ్వాలి. వేతనం విషయంలో సుప్రీం కోర్టు నిబంధనలు పాటించాలి. కోఆర్డినేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. హెల్త్ పాలసీ, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలి. పలు సార్లు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించాం. స్పందించనందునే సమ్మెబాట పట్టాం.

– వెంకటయ్య, సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్

మురుగు.. కనుమరుగయ్యేనా?



కల్యాణ్‌నగర్ కాలనీలో మురుగు రోడ్లపైనే పారుతోంది. కాల్వలు లేకపోడంతో గుంతలలో నిలిచి దుర్గంధం నెలకొంటోంది. కాల్వలు నిర్మించాలని ఏళ్లుగా కోరుతున్నా పాలకులు స్పందించడంలేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో కాల్వల కోసం గుంతలు తీసి వదిలేశారు. అందులో కూడా మురుగు చేరి దోమలకు నిలయంగా మారింది. - కుల్కచర్ల

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 90102 99041

రైతు సమన్వయ కమిటీలు వేయండి

- నాయకులకు, రైతులకు కొప్పుల సూచన



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్వర్‌రెడ్డి

పరిగి: గ్రామ, మండల స్థాయిలో రైతు సమన్వయ కమిటీల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాలని టీఆర్ఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పరిగి పట్టణంలో ఆయన నివాసంలో దోమ మండల టీఆర్ఎస్ నాయకులు, మండల రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 15 సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మండలంలో 24 మందితో రైతు సమన్వయ కమిటీలు నిర్వహించి సంబంధిత వివరాలను నివేదిక అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటయ్య, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, మాజి జెడ్పీటీసీ సభ్యుడు బోయిని లక్ష్మయ్య, జిల్లా గ్రంథాయల సంస్థ డైరెక్టర్ యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి యాదయ్యసాగర్, శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్‌నాయక్, నవాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌లో యువతకు పెద్దపీట

- పార్టీ యువ నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి



కమిటీ అధ్యక్షుడికి పార్టీ కండువా కప్పుతున్న నాయకుడు

పూడూరు: తెలంగాణ ప్రభుత్వం యువతకు పెద్దపీట వేస్తున్నదని టీఆర్ఎస్ యువ నాయకులు కొప్పుల అనీల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మన్నెగూడ, చీలాపూర్ గ్రామాల్లో యువకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందజేశారని తెలిపారు. యువత ఎల్లప్పుడూ సమాజ సేవలో పాలుపంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మన్నెగూడ గ్రామ యూత్ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ యూత్ అధ్యక్షునిగా ఏ. లక్ష్మణ్, ఉపాధ్యక్షునిగా లోకేష్, ప్రధాన కార్యదర్శిగా కె. రాజు, కార్యనిర్వాహణ కార్యదర్శిగా నర్సింలును ఎన్నుకున్నారు. యువజన నాయకులను ఏకతాటిపైకి తెచ్చి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. అనీల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు యువకులు పార్టీలో చేరారు.

ప్రమాదకర గుంతలు పూడ్చివేయండి

పరిగి: రోడ్లపై ఏర్పడిన ప్రమాదకర గంతలు పూడ్చి వేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి పీర్‌మహ్మద్, మండల కార్యదర్శి వెంకటేష్ కోరారు. మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ గోవిందమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. వివేకానంద చౌరస్తా, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదుట రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయని తెలిపారు.

లోకల్ వాయిస్

సీపీఎస్ విధానం వద్దు



సీపీఎస్ విధానంతో ఉద్యోగులకు భరోసా లేకుండా పోయింది. జీవిత కాలం ప్రభుత్వ రంగంలో ఉద్యోగం చేసినప్పటికీ విశ్రాంత సమయంలో భద్రత లేకుండా పోయింది.సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి.

బి. రమేష్, ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ సంఘం నాయకుడు, దోమ

ఉద్యోగ భద్రత ఏదీ?



సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులకు భద్రత కరువైంది. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలి. కాంట్రాక్ట్ ఉద్యోగుల శ్రమను గుర్తించి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే అన్ని వసతులు కల్పించాలి.

- ఎం. కృష్ణయ్య, మండల సీఆర్‌పీ, దోమ

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో



వెండితెర



నేనే మంత్రి.. నేనే రాజు: భవాని 70 ఎంఎం(పరిగి) 11.15, 2.15, 6.30, 9.30
వివేకం: సాయికృష్ణ 70 ఎంఎం (పరిగి) 11.15, 2.15, 6.30, 9.30
జయ జానకి నాయక: శారద 70 ఎంఎం ఏ/సీ డీలక్స్ (పరిగి) 11.15, 2.15, 6.30, 9.30
సెల్ 9666949797

పూజలు.. నిమజ్జనాలు



పరిగి: టీచర్స్ కాలనీ హనుమాన్ దేవాలయంలో పూజలందుకుంటున్న వినాయకుడు



పరిగి: బాలాజీనగర్‌లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న సీఐ, ఎస్ఐ తదితరులు



దోమ: నిమజ్జన కార్యక్రమంలో భక్తులు

పరిగి: మండపాల్లో వివిధ రూపాల్లో కొలువు దీరిన గణనాథులు తీరొక్కపూలు, పండ్లు, ఫలహారాలు, నైవేద్యాలతో పూజలందుకుంటున్నారు. ఆయా కాలనీల్లో కొలువైన గణపయ్యలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటున్నారు. టీచర్స్ కాలనీ, ఫోర్‌వీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకులను మంగళవారం ఐదవ రోజు నిమజ్జనం చేశారు. బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని పరిగి సీఐ నాగేశ్వర్‌రావు, ఎస్ఐ కృష్ణ దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు.



పరిగి: టీచర్స్ కాలనీలో..

ఘనంగా నిమజ్జనం

దోమ: మండల పరిధిలోని పాలేపల్లి, దాదాపూర్, దోమ, బొంపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో కొలువు దీరిన గణనాథులకు పలువురు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పాలేపల్లిలో వినాయక ఉత్సవాలల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానాలు

పూడూరు: మండల పరిధిలో మండపాల్లో కొలువైన గణనాథులు ఘణంగా పూజలు అందుకుంటున్నారు. మండల పరిధిలోని శేరిగూడ, పూడూరు, చన్గోముల్, ఎన్కేపల్లి, అంగడి చిట్టంపల్లి తదితర గ్రామాల్లో భజనమండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు. పలు విగ్రహాల వద్ద అన్నదానం చేశారు.

ఘనంగా నిమజ్జనాలు

కుల్కచర్ల: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ముజాహిద్‌పూర్లో మంగళవారం నిమజ్జన కార్యక్రమం జరిగింది. ఘనంగా పూజలు అందుకున్న గణనాథులను ఐదో రోజు నిమజ్జనం చేశారు. కుల్కచర్లలో అన్నదానాలు జరిగాయి. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కరణం ప్రహ్లాదరావు పాల్గొని పూజలు నిర్వహించారు.



దోమ: పాలేపల్లిలో అన్నదానం



కుల్కచర్ల: ముజాహిద్‌పూర్‌లో..



పూడూరు: శేరిగూడలో గణేశునికి పూజలు చేస్తున్న నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి తదితరులు



పూడూరు: వినాయకునికి పూజలు



కుల్కచర్ల: పూజలో పాల్గొన్న బీజేపీ నాయకులు తదితరులు

న్యూస్ బాక్స్

రుబెల్లా టీకాలు వేయించాలి



టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రయ్య

పరిగి: చిన్నారులందరికీ రుబెల్లా టీకాలు వేయించాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పీ. చంద్రయ్య అన్నారు. మంగళవారం పరిగిలోని సుధీక్ష పాఠశాలలో టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి టీకాలు వేశారు. సుల్తాన్‌పూర్ పాఠశాలలో సైతం మంగళవారం టీకాలు వేయించారు.

టీకాలతోనే ఆరోగ్యం

కుల్కచర్ల: రుబెల్లా టీకాలు వేయిస్తే పిల్లలకు ఆరోగ్యంగా ఉంటారని, చిన్నారులందరికీ తప్పనిసరిగా టీకాలు వేయించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మురళీ, సీహెచ్ఓ చంద్రప్రకాశ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సుభ్యానాయక్ తండా, పటేల్ చెరువు తండా ఘటనపల్లిలోని పాఠశాలల్లో చిన్నారులకు టీకాలు వేశారు. ఈ టీకాలతో పిల్లల్లో ఎదుగుదలతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వారు అన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాలలో హెరిటేజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని హెరిటేజ్ రీజినల్ హెడ్ సర్వోత్తమరెడ్డి అన్నారు. మంగళవారం పుట్టపహాడ్‌లో హెరిటేజ్ రైతు సంక్షేమ నిధి, హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలతో పాటు సబ్సిడీపై దాణా, పాల క్యాన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, బాల్‌రాజ్, ప్రమోద్, సూపర్‌వైజర్ హాజీశరీఫ్, రాకేష్, ఆనంద్, రామకృష్ణారెడ్డి, పాలసేకరణ ప్రతినిధి పాల్గొన్నారు.

పాఠశాలల్లో త్రీఆర్స్ అమలు చేయాలి



అంతారం పాఠశాలలో విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి

కుల్కచర్ల: ప్రతి పాఠశాలలో విద్యాశాఖ సూచించిన విధంగా త్రీఆర్స్ పద్ధతి, పిల్లలకు రాయడం, చదవడం, గుణించడం తప్పనిసరిగా అమలుకావాలని మండల విద్యాధికారి అబీబ్ హమ్మద్ అన్నారు. మంగళవారం చిన్న అంతారం, పెద్ద అంతారం పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల రిజిష్టర్‌ను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు అనుమతి లేకుండా గైర్హాజరైతే శాఖ పరమైన చర్యలు ఉంటాయని అన్నారు. అదే విధంగా విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. పాఠాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రాలను అందుకుంటున్న నూతన కమిటీ సభ్యులు

కుల్కచర్ల: మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్లు పీఆర్టీయూ నాయకులు తెలిపారు. మండల పీఆర్టీయూ అధ్యక్షుడుగా హన్మంతు, ప్రధాన కార్యదర్శిగా వి.రాకేష్, కార్యదర్శులుగా వెంకటయ్య, దేవుజా, తుల్జారామ్, ప్రసాద్, రవిందర్, డీ వెంకటయ్య అసోసియేట్ సభ్యులుగా సురేష్, సుధాకర్, ఉపాధ్యక్షులుగా బస్వరాజ్, రాఘవేందర్‌రెడ్డి, సి.వెంకటేష్, బాలు, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్. మండల మహిళ అధ్యక్షురాలిగా రామేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా అపర్ణలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

గంగ ఒడికి గణేశుడు



పెద్దేముల్: గొట్లపల్లిలో ఊరేగింపు



కరన్‌కోట్: పాత తాండూరులో వినాయక శోభాయాత్ర

తాండూరు:

మండలంలోని ఆయా గ్రామాల్లో కొలువైన గణపయ్యకు భక్తులు మంగళవారం వీడ్కోలు పలికారు. మండలంలోని గౌతాపూర్, కరన్‌కోట్, బెల్కటూర్, మల్కాపూర్, సిరిగిరిపేట్, జినుగుర్తి, వీరారెడ్డిపల్లి, కొత్లాపూర్, రాంపూర్‌తో పాటు పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం కొనసాగింది. గత ఐదు రోజులుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. గౌతాపూర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన స్వామివారికి టీఆర్‌ఎస్ నేత రోహిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీఆర్‌ఎస్ మహిళా విభాగం నాయకురాలు శకుంతల ఉన్నారు.

- భక్తిశ్రద్ధలతో లంబోదరుడి నిమజ్జనం
- అలరించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- కన్నుల పండువగా స్వామివారి శోభాయాత్ర

బైబై గణేశా..

బషీరాబాద్: బషీరాబాద్ మండలంలో వినాయక నిమజ్జనం మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు ఐదో రోజు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో చెరువుల వద్దకు తరలించారు. ఈ సందర్భంగా బషీరాబాద్‌లోని రైల్వే గేటు సమీపంలోని బావి వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, యువతభజనలు, నృత్యాలతో అలరించారు.

రోహిత్‌రెడ్డి పూజలు..

అంతకు ముందు తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర కార్యదర్శి, యంగ్‌లీడర్స్ అధ్యక్షుడు పైలెట్ రోహిత్‌రెడ్డి బషీరాబాద్, ఇందర్‌చేడ్‌లో వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సారి తాండూరులో వినాయక ఉత్సవాల్లో యంగ్‌లీడర్స్‌కు చెందిన 100 మంది యువకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులతో పాటు సేవలు అందిస్తున్నారని చెప్పారు. మండపాల వద్ద సంఘం ఆధ్వర్యాన అన్నదానం చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ అజయ్ ప్రసాద్, సర్పంచ్ జయమ్మ, యంగ్‌లీడర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీకృష్ణ, రాఘవేందర్, రఘు, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రోహిత్ మహరాజ్ స్వామివారికి పూజలు చేశారు.

గణపయ్యా.. ఇక సెలవయ్యా..

పెద్దేముల్: మండలంలోని గొట్లపల్లి, అడ్కిచెర్ల, గాజీపూర్, మంబాపూర్, బుద్దారం, కందనెల్లి, రుక్మాపూర్, మన్‌సాన్‌పల్లి, పాషాపూర్, ఉరేంటితండా, కొండాపూర్, మదనంతపూర్ తదితర గ్రామాల్లో మంగళవారం గణనాథుడి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఐదు రోజుల పాటు పూజలు అందుకున్న బొజ్జ గణపయ్యలను ఆయా గ్రామాల శివారుల్లోని బావులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. వాడ వాడన వినాయకులను ఊరేగించటంతో పండుగ వాతావరణం కనిపించింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు, కోలాటాలు నిర్వహించారు. గొట్లపల్లి గ్రామంలోని గణేశుడి లడ్డూలను బంటు అంజిలప్ప రూ.17,100కు , బంటు అంతప్ప రూ.15,100 వేలంలో దక్కించుకున్నారు. ఎస్‌ఐ నాగశ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. గొట్లపల్లి మాజీ సర్పంచ్ చంద్రప్ప, పూజారి మల్లప్ప, అంజిలప్ప తదితరులు కట్‌పల్లి ప్రాజెక్టులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.



తాండూరు: గౌతాపూర్‌లో శోభాయాత్ర

ఘనంగా వీడ్కోలు..

కరన్‌కోట్: ఐదురోజులు పూజలందుకునకన గణపయ్యకు తాండూరువాసులు ఘనంగా వీడ్కోలు పలికారు. నృత్యాలు చేస్తూ స్వామివారిని సాగనంపారు. వెళ్లిరావయ్యా.. మళ్లీ రావయ్యా అంటూ నిమజ్జనం చేశారు. పూణే బ్యాండు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రశాంతంగా నిమజ్జనం..

యాలాల: మండల పరిధిలోని కోకట్ కాగ్నా నదిలో మంగళవారం వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. తాండూరు పట్టణంతో పాటు వివిధ గ్రామాలలో గత ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులకు భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. తాండూరు పట్టణంలోని వినాయకులతో పాటు డివిజన్‌లోని వివిధ గ్రామాల నుంచి వినాయకులను కోకట్ కాగ్నా నదిలో నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి ముందు వినాయకులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై అంటూ నినదించారు.



బషీరాబాద్: పూజలు చేస్తున్న రోహిత్‌రెడ్డి



పెద్దేముల్: యువకుల కోలాహలం



కరన్‌కోట్: పోలీసుల బందోబస్తు



పట్టణంలోని రైతు బజారు వద్ద వ్యాపారులు కుళ్లిపోయిన కూరగాయలను ప్రధాన ద్వారం పక్కనే పారవేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వినియోగదారులు లోనికి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. – వికారాబాద్ అర్బన్:

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9985223745

zone guide

ఆరిపోయే దీపం టీఆర్‌ఎస్: కాంగ్రెస్



కాంగ్రెస్‌లో చేరిన వారితో రమేష్

యాలాల(తాండూరు): ఆరిపోయే దీపం లాంటిది టీఆర్‌ఎస్ పార్టీ అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్ అన్నారు. మండలంలోని గిరిజాపూర్ గ్రామంలో పలువురు టీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో దొరలపాలనతో పాటు కుటుంబ కంపెనీ పాలన కొనసాగుతోందని ఎద్దేవా చేశారు. కమీషన్ల కోసమే మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పనులను చేపడుతున్నారన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన డబుల్ బెడ్ రూంలు జాడలేకుండా పోయిందని ఎద్దేవాచేశారు. వాస్తును నమ్ముకున్న సీఎం కేసీఆర్ వినియోగంలో ఉన్న రూ.70 కోట్ల విలువ చేసే క్యాంపు ఆఫీసును కూల్చివేసి, రూ.100 కోట్లతో ప్రగతి భవన్‌ను నిర్మించారని మండిపడ్డారు. అవసరం లేని ప్రగతి భవన్‌కు కేటాయించే నిధులను డబుల్‌బెడ్ రూంల నిర్మాణానికి వినియోగించి ఉండే ఎంతో మంది నిరుపేదల సొంతింటి కల సాకారం అయ్యేదని పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఒకేసారి రైతు రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. ఉత్తంచంద్, ధారాసింగ్, చెన్నారం మల్లయ్య, అమృతప్ప ఉన్నారు.

తాండూరులో కూరగాయల ధరలు.. కిలోకు

టమాట	రూ.50	బీన్స్	రూ.50
ఆలుగడ్డ	రూ.20	బీర	రూ.40
దొండ	రూ.50	కాకర	రూ.40
క్యారెట్	రూ.80	వంకాయ	రూ.40
ఉల్లి	రూ.35	చిక్కుడు	రూ.40
పచ్చి మిర్చి	రూ.40	క్యాలీఫ్లవర్	రూ.30
క్యాబేజి	రూ.30	కీర	రూ.40
బెండ	రూ.40	క్యాప్సికం	రూ.60



వెండితెర



వివేకం: శ్రీనివాస: 11.00, 2.00, 6.00, 9.00
అర్జున్‌రెడ్డి: శాంత్‌మహల్ 11.00, 2.00, 6.00, 9.00
ఫిదా: శ్రీలక్ష్మీమహల్ 11.30, 2.30, 6.30, 9.30
జయ జానకి నాయక: చంద్ర 11.00, 2.00, 6.00, 9.00

లోకల్ వాయిస్

మురుగు తొలగించాలి



పెద్దేముల్ గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీల్లోని డ్రైనేజీ కాల్వల్లో మురుగు పేరుకుపోయింది. దీంతో భరించలేని దుర్వాసన వస్తోందని స్థానికులు మొత్తుకుంటున్నారు. పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో దోమలు వ్యాపిస్తున్నాని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి మురుగు కాల్వల్లో నిండిన చెత్తను వెంటనే తొలగించాలి.

- గురువప్ప, పెద్దేముల్:

సొంత భవనాలు నిర్మించాలి



పెద్దేముల్ మండల జనగాం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సంబందిత అధికారులు చర్యలు తీసుకొని అన్ని సెంటర్లకు సొంత భవనాలు నిర్మించాలి. ఈ విషయాన్ని గత ఏడాది నుంచి మండల అధికారులకు విన్నవిస్తున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోతోంది. ఇప్పటికైనా స్పందించాలి.

- సత్యనారాయణ, జనగాం, పెద్దేముల్:

నాసికరం పనులతో ఇబ్బందులు



బురదలో దిగబడిన లారీ

వికారాబాద్: మర్పల్లి అనుబంధ గ్రామానికి వెళ్లే మెటల్ రోడ్డు పక్కల మిషన్ భగీరథ పైపులైన్ పనులు చేపట్టారు. ఈ క్రమంలో పైపులైన్ వేసిన తరువాత మట్టి పనులు నాసిరకంగా చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల ఆ మట్టి బురదగా మారింది. దీంతో ఓ లారీ అందులో ఇరుక్కుపోయింది.



ఇళ్ల నడుమ మురుగు గుంత

పర్వత్‌పల్లిలో జనావాసాల మధ్య పెద్ద మురుగు గుంత ఉంది. ఇందులో దోమలు పెరిగి కాలనీ మొత్తం వ్యాపిస్తున్నాయి. చీకటి పడిందంటే వీటి బెడద విపరీతంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- బషీరాబాద్:

తండాలో వైద్య శిబిరం



దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది



తండాలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

- 'సాక్షి' కథనంతో కదిలిన అధికారులు
- తండాలో సమస్యలపై ఆరా
- పరిష్కారానికి హామీ

పెద్దేముల్: పెద్దేముల్ మండల ఆత్కూర్‌తండాకు మంగళవారం అధికారులు తరలివచ్చారు. 'విజృంభిస్తున్న విషజ్వరాలు' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనం యంత్రాగాన్ని కదిలించింది. ఉదయమే గ్రామానికి చేరిన సిబ్బంది తండాలోని వీధుల్లో తిరుగుతూ గిరిజనవాసుల సమస్యలు తెలసుకున్నారు. తాగునీటి పైపులు పాడయ్యాయని, నీటి సమస్య ఉందని, తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు చెప్పారు. పాడైన చేతి పంపులను రెండు రోజుల్లో బాగు చేయిస్తానని ఎంపీడీఓ రామప్రసన్న, ఈఓపీఆర్డీ మధుసూదన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఏటా తాగునీటి కోసం కోట్ల రుపాయలు ఖర్చు చేస్తున్నామని చెప్పడమే తప్ప తమకు చేసింది ఏమీ లేదని గిరిజనులు మండిపడ్డారు. పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 70మందికి పలు పరీక్షలు చేశారు. దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తామని సిబ్బంది మల్లేశం, రఘుపతి, హరిశంకర్ తెలిపారు. తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమస్యను పరిష్కరించాలని సర్పంచ్‌కు సూచించారు.

ధర్నాతో దిగొచ్చిన యంత్రాంగం

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బురదమయం కావడంతో సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండల రాజకీయ జేఏసీ నాయకులు సోమవారం చేపట్టిన ధర్నాతో ఆర్‌టీసీ అధికారులు దిగొచ్చారు. బురదగా ఉన్న రోడ్డుపై కంకర వేఇస సరిచేశారు. బస్టాండులో విద్యుత్ బల్బులు వేయించేందుకు ఆదేశాలిచ్చారు. అప్పటికప్పుడు కొన్ని సమస్యలు పరిష్కారమైనట్లు ప్రయాణికులు తెలిపారు. ఇప్పటికైనా మెరుగైన సేవలు అందించాలన్నారు.



బురదను తొలగించి కంకర వేస్తున్న సిబ్బంది

న్యూస్ బాక్స్

సీపీఎస్ అంతమే లక్ష్యం



ముశవీర్

బషీరాబాద్: ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాలిట శాపంగా దాపురించిన సీపీఎస్ అంతమే లక్ష్యంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలంగాణ సీపీఎస్ ఈఏ మండల అధ్యక్షుడు ముశవీర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాత పింఛను విధానాన్ని(ఓపీఎస్) సాధించే వరకు అలుపెరుగని పోరాటం చేస్తామని వెల్లడించారు. సెప్టెంబర్ 1న జిల్లా కేంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలలతో భారీ నిసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు స్పష్టంచేశారు. ఒకరోజు నిరసన కోసం ఇప్పటికే ఉద్యోగులంతా మూకుమ్మడి సెలవులు పెట్టామని చెప్పారు. ఆరోజు జరిగే నిరసనతో తమ సత్తా ఏంటో ప్రభుత్వానికి తెలిసివచ్చేలా చేసి చూపిస్తామని వెల్లడించారు. నిరసన తర్వాత కూడా ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్ ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని చెప్పారు. అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

మార్కెట్ యార్డులో బీట్లు



వికారాబాద్: మర్పల్లి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యానికు మంగళవారం కమీషన్ ఏజెంట్లు బీట్లు నిర్వహించారు. ఈ బీట్లలో మొదటి రకం వామ క్వింటాల్‌కు రూ.8,100, రెండో రకం రూ.7,500 పలికింది. పసుపు మొదటిరకం క్వింటాల్‌కు రూ.7,000, రెండో రకం రూ.6,500 పలికింది. పెసర్లు క్వింటాల్‌కు రూ.4,700 పలికింది. ఈ బీట్లలో కొనుగోలుదారులు, కమీషన్ ఏజెంట్లు పాల్గొన్నారు. ప్రతీ మంగళవారం బీట్లను మార్కెట్ కార్యదర్శి, సూపర్ వైజర్ సమక్షంలో నిర్వహిస్తారు. వారు హాజరుకాకపోవడంతో మార్కెట్ సిబ్బంది ఆధ్వర్యంలో బీట్లు నిర్వహించారు.

ఇంటర్వ్యూ



రామప్రసన్న
అంశం: చీరల పంపిణీ
హోదా: ఎంపీడీఓ

ప్రశ్న: బతుకమ్మ చీరలను ఎవరెవరికి అందజేస్తారు.?
జవాబు: తెల్ల రేషన్ కార్డు ఉండి, 18 సంవత్సరాలు నిండిన వారికి బతుకమ్మ చీరలు అందజేస్తాం. ఇందుకు ఆధార్, టెన్త్ సర్టిఫికెట్‌ను వయస్సు ధ్రువీకరణగా తీసుకుంటాం.
ప్రశ్న: చీరల పంపిణీకి ఎలాంటి ఏర్పాట్లు చేశారు.?
జవాబు: గ్రామాల్లో కమిటీలు వేసి, అర్హులందరికీ అందేలా చూస్తాం.
ప్రశ్న: కమిటీల్లో ఎవరెవరు సభ్యులుగా ఉంటారు.?
జవాబు: కమిటీల్లో పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ కార్యదర్శి ,రేషన్ డీలర్‌తో ఐకేపీ సీసీ తదితరులు మెంబర్లుగా ఉంటారు.
ప్రశ్న: చీరలను నిల్వ చేసేందుకు గోదాంలు ఎక్కడ ఏర్పాటు చేస్తారు.?
జవాబు: ఆయా పంచాయతీల్లో చీరలను నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.
ప్రశ్న: కుటుంబంలో ఎంత మంది ఇస్తారు.?
జవాబు: కుటుంబంలో ఉన్న ఆధార్ కార్డు అధారంగా పంపిణీ ఉంటుంది.
ప్రశ్న: మండలంలో ఎంత మందిని గుర్తించారు.
జవాబు: తహసీల్దార్ల ఆధ్వర్యంలో లబ్ధిదారులను గుర్తిస్తారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలు అందజేస్తాం.

- పెద్దేముల్:

రైతు బజారు వద్ద దుర్వాసన



వికారాబాద్ అర్బన్: పట్టణంలోని రైతు బజారు వద్ద వ్యాపారులు కుల్లిపోయిన కూరగాయలను ప్రధాన ద్వారం పక్కనే పారవేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వినియోగదారులు లోనికి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్ నిర్వాహకులు అక్కడే ఉంటున్నా పారిశుద్ధ్యంపై దృష్టి సారించడంలేదు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94920 28209

అంతా గుంతలమయం



మోమిన్‌పేట: చంద్రాయన్‌పల్లికి వెళ్లే రోడ్డు



బంట్వారం: సుల్తాన్‌పూర్‌లో పీఆర్ రోడ్డు దుస్థితి



బంట్వారం: కోట్‌పల్లిలోని ఆర్అండ్‌బీ రోడ్డు ఇలా ..

మోమిన్‌పేట: మండల కేంద్రం నుంచి చంద్రాయన్‌పల్లి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు అంతా గుంతలమయంగా మారింది. దీంతో ఈ రోడ్లపై నడిచేదెట్లా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. చినుకు పడితే చాలు గుంతల్లో నీళ్లు నిలిచి వాహనాదారుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాని వారు పేర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి చినుకు పడితే చాలు ఇబ్బందులు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని కోరుతున్నారు.

సుల్తాన్‌పూర్ రోడ్డును పట్టించుకోరా?

బంట్వారం: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ఉన్న రోడ్డును ఎవరూ పట్టించుకోవడంలేదు. గ్రామంలో దాదాపు వంద మీటర్ల రోడ్డు నిర్మాణాన్ని పీఆర్ అధికారులు మరిచిపోయారు. దీంతో గుంతలు పడి నడవడానికి సైతం ఇబ్బందిగా ఉంది. కొత్తపల్లి మీదుగా సుల్తాన్‌పూర్ నుంచి బంట్వారం వెళ్లే ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది కిందట బీటీ రోడ్డు వేసిన గుత్తేదారు వంద మీటర్ల రోడ్డును వేయకుండానే వెళ్లిపోయారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయాన్ని ఎన్నిసార్లు తీసుకువెళ్లినా స్పందించడంలేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు వేయించాలని కోరుతున్నారు.

కోట్‌పల్లి మెయిన్ రోడ్డు ఇలా..

ఆర్అండ్‌బీ రోడ్డు పనులు నత్తనడకన సాగడంతో కోట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు బురదమయంగా తయారైంది. సంబంధిత గుత్తేదారు ఏడాది కాలంగా పనులు సాగిస్తున్నారు. చిన్నపాటి చినుకులు పడితే రోడ్డంతా చిత్తడిగా మారుతోంది. ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా రోడ్డంతా బురదతో నిండిపోయింది. ప్రజలు నడవడానికి కూడా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

ధాన్యం బస్తాలకు బీట్లు



మార్కెట్లో బీట్లు నిర్వహిస్తున్న కమీషన్ ఏజెంట్లు

వికారాబాద్: మర్పల్లి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యంకు మంగళవారం కమీషన్ ఏజెంట్లు బీట్లు నిర్వహించారు. ఈ బీట్లలో మొదటి రకం వామ క్వింటాల్‌కు రూ.8,100, రెండో రకం రూ.7,500 పలికింది. పసుపు మొదటిరకం క్వింటాల్‌కు రూ.7,000, రెండో రకం రూ.6,500 పలికింది. పెసర్లు క్వింటాల్‌కు రూ.4,700 పలికింది. ఈ బీట్లలో కొనుగోలుదారులు, కమీషన్ ఏజెంట్లు పాల్గొన్నారు. ప్రతీ మంగళవారం బీట్లను మార్కెట్ కార్యదర్శి, సూపర్ వైజర్ సమక్షంలో నిర్వహిస్తారు. ఈసారి వారిద్దరు విధులకు హాజరుకాకపోవడంతో మార్కెట్ సిబ్బంది ఆధ్వర్యంలో బీట్లు నిర్వహించారు.

మోమిన్‌పేటలో మోస్తరు వర్షం



మోమిన్‌పేటలో కురుస్తున్న వర్షం

మోమిన్‌పేట: మోమిన్‌పేటలో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా తుంపర వర్షం కురవడంతో పంటలకు మేలుచేసిందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం పట్ల రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నాసిరకం పనులతో ఇబ్బందులు



బురదలో దిగబడ్డ ఇసుక లారీ

వికారాబాద్: మర్పల్లి అనుబంధ గ్రామానికి వెళ్లే మెటల్ రోడ్డు పక్కల మిషన్ భగీరథ పైపులైన్ పనులు చేపట్టారు. ఈ క్రమంలో పైపులైన్ వేసిన తరువాత మట్టి పనులు నాసిరకంగా చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల ఆ మట్టి బురదగా మారింది. దీంతో ఓ లారీ అందులో ఇరుక్కుపోయింది. దీంతో రెండు గంటల పాటు తండా నుంచి మండల కేంద్రానికి వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ధర్నాతో దిగొచ్చిన యంత్రాంగం



బురదలో బస్సు దిగుతున్న ప్రయాణికులు



బురదను తొలగించి కంకర వేస్తున్న సిబ్బంది

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బురదమయం కావడంతో సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండల రాజకీయ జేఏసీ నాయకులు సోమవారం చేపట్టిన ధర్నాతో ఆర్టీసీ అధికారులు దిగొచ్చారు. బురదగా ఉన్న రోడ్డుపై కంకర వేఇస సరిచేశారు. బస్టాండులో విద్యుత్ బల్బులు వేయించేందుకు ఆదేశాలిచ్చారు. అప్పటికప్పుడు కొన్ని సమస్యలు పరిష్కారమైనట్లు ప్రయాణికులు తెలిపారు.

లోకల్ వాయిస్

లోఓల్టేజీని నివారించండి



ధారూరు: మండలంలోని నార్సపూర్‌లో నిత్యం లోఓల్టేజీ సమస్య నెలకొంటోంది. విద్యుత్ అవసరం లేని పగటిపూట సరఫరా బాగున్నా రాత్రిళ్లు ఇక్కట్లకు గురవుతున్నాం. ఈ విషయమై విద్యుత్ సిబ్బందికి పలుమార్లు చెప్పినా సరి చేయలేరు. అధికారులు కల్పించుకుని లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి.

- పాండు, నర్సాపూర్, ధారూరు మండలం

సమస్యలు పరిష్కరించాలి



వికారాబాద్: మర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండేళ్లుగా తాగునీటి సమస్యతో విద్యార్థులు అల్లాడుతున్నారు. ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కావడంలేదు. పాఠశాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- మజర్, మండల అధ్యక్షుడు, టీఎన్ఎస్ఎఫ్

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

వెండితెర



నేనే రాజు నేనే మంత్రి:
ఏషియన్ శైలజ : వికారాబాద్)
11.15, 2.15, 6.15, 9.15
శాంత్‌మహల్
11.00, 2.00, 6.00, 9.00

జయ జానకి నాయక:
సినీమాక్స్ (వికారాబాద్)
11.00, 2.00, 6.00, 9.00
శ్రీలక్ష్మీమహల్ (తాండూరు)
11.30, 2.30, 6.30, 9.30



అదనంగా బస్సులు నడపాలి

వికారాబాద్: ప్రతీ మంగళవారం మర్పల్లి నుంచి మోమిన్‌పేట్, కల్‌ఖోడ, బుదేర, రావులపల్లి వరకు అదనంగా బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. మర్పల్లిలో సంత ఉండడంతో మోమిన్‌పేట్, బంట్వారం మండలతో పాటు సంగారెడ్డి సమీప గ్రామాలు వస్తారు. దీంతో ప్రయాణికులు, విద్యార్థులకు సరిపడా బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

గణపతి బప్పా మోరియా



ధారూరు: ఊరేగింపులో మట్టి వినాయకుడు



అనంతగిరి: రైల్వే కాలనీలో శోభాయాత్ర



మోమిన్‌పేట: పూజలందుకుంటున్న గణనాథుడు

- ఘనంగా శోభాయాత్ర
- భక్తిపాటలు, భజనలు, నృత్యాలతో హోరెత్తిన ఊరేగింపు

ధారూరు: ఘండల కేంద్రంలో వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం శోభాయమానంగా సాగింది. వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులందరూ కలిసి నెలకొల్పిన వినాయకుడు ముందు వరుసలో ఉండగా, ఆ తర్వాత వివిధ కాలనీల్లోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వినాయకులు అనుసరించాయి. గణపతి బొప్పా మోరియా–ఆదా లడ్డూ ఖాలియా, గణేశ్ మహారాజ్‌కీ జై తదితర నినాదాలు చేస్తూ భక్తి పాటలు, భజనలు, నత్యాలు చేస్తూ ముందుకు కదిలారు. చిన్నారులు, యువకులు కోలాటం ఆడుతూ భజనలు చేస్తూ, కేరింతలు కొడుతూ, బ్యాండ్ మేళాల మధ్యన విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా వినాయకుల చేతుల్లోని లడ్డులను వేలం వేసి, ఆ తర్వాత కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

వికారాబాద్‌లో..

అనంతగిరి: వికారాబాద్‌లోని ఆయా వాడల్లో కొలువుదీరిన పలు గణనాథులను ఐదు రోజులు సందర్భంగా మంగళవారం నిమజ్జనం చేశారు. ఇందులో భాగంగా రైల్వే క్వార్టర్స్‌లో ప్రతిష్టించిన వినాయకుడికి నిత్యం పూజలు చేశారు. సరస్వతి జూనియర్ కళాశాల, వైష్ణవి హైస్కూల్, సిద్దార్థ హైస్కూల్, ధన్నారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలతో పాటు ఆయా వాడల్లో శోభాయాత్ర ఘనంగా సాగింది. యువకులు, విద్యార్థుల కోలాటాలు, నృత్యాలు చేస్తూ హుషారుగా ముందుకుసాగారు. ఎబ్బనూర్ చెరువులో నిమజ్జనం చేశారు.

పూజలందుకుంటున్న గణనాథుడు

మోమిన్‌పేట: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయక మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు ఐదవ రోజు భక్తులతో పూజలందుకొంటున్నాడు. భక్తులు ఉత్సాహంగా భజనలు చేస్తున్నారు. మండలంలోని చంద్రాయన్‌పల్లిలో వినాయక నిమజ్జనాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి బప్పా మోరియో అంటూ యువకులు, భక్తులు నినదించారు. ఉదయం భక్తిశ్రద్ధలతో గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన వీధుల గుండా గణనాథున్ని ఊరేగిస్తూ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. అనంతరం నంది వాగు ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు.



ధారూరు: ఊరేగింపులో ఉత్సవ కమిటీ సభ్యులు



అనంతగిరి: శోభాయాత్ర



అనంతగిరి: వైష్ణవి స్కూల్‌లో చిన్నారుల కోలాటం

Zone Guide

విద్యార్థులకు సరిపడా బస్సులు నడపాలి

వికారాబాద్ అర్బన్: విద్యార్థులకు సరిపడా బస్సులు నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు యాదగిరి అన్నారు. మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, జిల్లాకు చెందిన రవాణా శాఖ మంత్రి ప్రతీ మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిపిస్తామని చెబుతున్నారే తప్పా ఆచరణలో పెట్టడంలేదన్నారు. గ్రామాలకు బస్సులు వెళ్లకపోవడంతో వందల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బార్వాద్, మోత్కుపల్లి, సాపన్‌పల్లి, మదన్‌పల్లి, అత్వెల్లి, కొంపల్లి తదితర గ్రామాలకు ఒకే బస్సు ఉండడంతో విద్యార్థులు ఆ బస్సులో వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు సరిపడా బస్సులు నడిపించాలని వారు డిమాండ్ చేశారు. మదన్‌పల్లి వరకు ప్రత్యేక బస్సు నడపాలన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రశాంత్ రెడ్డి, నరేష్, ముస్తాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిపోయే దీపం టీఆర్‌ఎస్: కాంగ్రెస్

యాలాల(తాండూరు): ఆరిపోయే దీపం లాంటిది టీఆర్‌ఎస్ పార్టీ అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్ అన్నారు. మండలంలోని గిరిజాపూర్ గ్రామంలో పలువురు టీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో దొరలపాలనతో పాటు కుటుంబ కంపెనీ పాలన కొనసాగుతోందని ఎద్దేవా చేశారు.

ఇంటర్వ్యూ

హరి
అంశం:డయల్ యువర్ డీఎం
మేనేజర్, వికారాబాద్ డిపో



ప్రశ్న: నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఏ ఉద్దేశంతో నిర్వహిస్తున్నారు?
జవాబు: ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవాలనే ఉద్దేశంతో, వారి సలహాలు సూచనలు కూడా ఇవ్వవచ్చు.
ప్రశ్న: కార్యక్రమం ఎప్పుడు ఉంటుంది, ఫోన్ నెంబర్లు తెలపండి?
జవాబు: నేడు సాయంత్రం 4గం నుంచి 5గంటల వరకు ఉంటుంది. ఫోన్ నెం: 9959226252, 7382826252కు చేయవచ్చు.
ప్రశ్న: డిపో పరిధిలో ఎన్ని గ్రామాలకు బస్సులు నడుపుతున్నారు?
జవాబు: రోడ్డు మార్గం ఉంది, బస్సులో పోవడానికి అవకాశం ఉన్నా అన్ని గ్రామాలకు బస్సులు నడుపుతున్నాం.
ప్రశ్న: డిపోలో ప్రస్తుతం ఎన్ని బస్సులు ఉన్నాయి. ?
జవాబు: 81 బస్సులు ఉన్నాయి. అన్నీ కూడా ఆర్డినరీ బస్సులే.
ప్రశ్న: చాలా గ్రామాలకు బస్సులు వెళ్లక విద్యార్థులు ధర్నా చేస్తున్నారు. ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారు?
జవాబు: ప్రధాన రోడ్లకు అర కిలోమీటర్, ఒక కిటోమీటర్ దూరంలో ఉన్న గ్రామాలకు బస్సులు రావాలని కోరుతున్నారు. ఆ విషయాన్ని పరిశీలిస్తున్నాం. ఎక్కువ మంది విద్యార్థులు వచ్చే రూట్లలో రెండు నుంచి మూడు ట్రిప్పులు నడుపుతున్నాం.
ప్రశ్న: బస్టాండ్లలో సమస్యలు ఉన్నాయనే ఫిర్యాదు ఉన్నాయి..?
జవాబు: నిజమే. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్, ఖాళీగా ఉన్న షాపులను అద్దెకు ఇస్తున్నాం. సమస్యలపై ఇటీవలే నివేదిక తయారు చేశాం.
ప్రశ్న: వికారాబాద్ డిపో లాభాల్లో ఉందా?
జవాబు: ఈ ఆర్థిక సంవత్సరం చాలా బాగుంది. అన్ని ఆర్డినరీ బస్సులే అయినా ఇప్పటికే రూ.1.40 కోటి ఆదాయంతో కొనసాగుతోంది. రాష్ట్రంలోనే రెండు లేదా మూడో స్థానంలో ఉన్నాం.

– వికారాబాద్ అర్బన్: